RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY    తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 127 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | శనివారం,నవంబర్,8,2025 | పేజీలు : 8 వెల : రూ.4/-

MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 127 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Saturday,November,8,2025 | PAGES : 8 RS : 4 /-



## వందేమాతర గీతం జాతీయవాద జ్వాలను రగిలిస్తోంది

### కేంద్ర మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,నవంబర్7 : వందేమాతరం గేయానికి 150 ఏళ్లు నిండాయి. స్వాతంత్ర్యోద్యమంలో ఆ గేయం ప్రజల్లో ఎంతో స్ఫూర్తి నింపింది. అయితే ఆ గేయం దేశ ప్రజల్లో ఇప్పటికీ నిరంతరం జాతీయవాద జ్వాలను రగిలిస్తోందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. దేశ ఐక్యత, దేశభక్తి, యువతలో ఉత్తేజానికి ఆ గేయం ఇంకా మూలంగానే ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.






## వందేమాతరం ఒక.. మంత్రం

### తరతరాలకు స్ఫూర్తి

- వందేమాతరం 150 ఏళ్ల ఉత్సవాలను ప్రారంభించిన ప్రధాని మోదీ
- ఈ సందర్భంగా స్మారక నాణెం, పోస్టల్ స్టాంపును ఆవిష్కరించిన ప్రధాని
- వందేమాతరం దేశ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని వ్యాఖ్య
- దేశవ్యాప్తంగా ఏడాది పాటు కొనసాగనున్న వేడుకలు
- పౌరులు తమ గళంతో వందేమాతరం పాడి పంపేందుకు డిజిటల్ పోర్టల్ ప్రారంభం

న్యూఢిల్లీ, నవంబర్7 : భారత జాతీయ గీతం 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏడాది పాటు జరిగే ఉత్సవాలను ప్రధాని నరేంద్ర మోదీ ఈరోజు ఘనంగా ప్రారంభించారు. ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన వందేమాతరం స్మారక నాణెం, పోస్టల్ స్టాంపును ఆవిష్కరించారు. ఈ గీతం దేశ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని, తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉందని ప్రధాని అన్నారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె. సక్సేనా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "నవంబర్ 7 ఒక చారిత్రకమైన రోజు. వందేమాతరం 150 ఏళ్ల మహోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ పవిత్ర సందర్భం కోట్లాది మంది భారతీయులలో కొత్త స్ఫూర్తిని, శక్తిని నింపుతుంది. వందేమాతరం అనేది కేవలం ఒక పదం కాదు, అది ఒక మంత్రం, ఒక శక్తి, ఒక కల, ఒక సంకల్పం. ఇది మనల్ని మన చరిత్రతో అనుసంధానిస్తుంది. మన ఆత్మవిశ్వాసాన్ని పెంచి, మనం సాధించలేని కల ఏదీ లేదని గుర్తుచేస్తుంది" అని తెలిపారు. మాతృభూమి కోసం ప్రాణాలర్పించిన వీరులకు ఆయన నివాళులర్పించారు.



## ఔను..భారత్ పర్యటనకు వెళ్ళే ఆలోచన ఉంది

- మోడీ మంచి మిత్రుడు..వాణిజ్య చర్చలు సాగుతున్నాయి
- నా ఒత్తిడితో రష్యా నంచి చమరు కొనుగోళ్లు ఆపారు
- స్వయంగా ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

న్యూఢిల్లీ, నవంబర్7 : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వచ్చే ఏడాది భారత్ పర్యటనకు రాబోతున్నారు. ఈ విషయాన్ని ట్రంప్ స్వయంగా ప్రకటించారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ మంచి మిత్రుడని చెప్పిన ట్రంప్.. భారత్‌తో వాణిజ్య చర్చలు అద్భుతంగా సాగుతున్నాయన్నారు. త్వరలో భారత్-అమెరికా వాణిజ్య చర్చలు కొలిక్కివస్తాయని ట్రంప్ తెలిపారు. భారత్‌లో పర్యటనకు సిద్ధమవు తున్నారు. వచ్చే ఏడాదిలో ఆయన పర్యటన ఉండే అవకాశం ఉంది. ఈ విషయంపై స్వయంగా హింట్ ఇచ్చిన ట్రంప్.. ప్రధాని మోదీ పై ప్రశంసల వర్షం కురిపించారు. భారత్- అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో ట్రంప్ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది.



## మాగంటి గోపీనాథ్ మరణంపై అనుమానాలున్నాయి..

### బండి సంజయ్ హాట్ కామెంట్స్

హైదరాబాద్,తెలంగాణ దిశ : దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంపై ఆయన అనుచరులు, బీఆర్ఎస్ పార్టీ కేడర్‌లో అనుమానాలు ఉన్నాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇవాళ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల వేళ ఎన్నికల కమిషన్, పోలీసులు అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదని అన్నారు. కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీలకు కొమ్ముకాయడం సిగ్గుచేటని అన్నారు. తెలంగాణలో అధికార, ప్రధాన ప్రతిపక్షం కలిసి పని చేస్తు న్నాయని.. కూడబలుక్కొని ఒకరినొకరు తిట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తాము ప్రచార సభలకు అనుమతి కోసం దరఖాస్తు పెట్టుకుంటే జాప్యం చేస్తూ చివరి నిమిషంలో అమమతి ఇవ్వలేమని చెబుతున్నారని సాయంత్రం రహమత్‌నగర్ సభకు పర్మీషన్ ఇవ్వాలని..



## ప్రైవేట్ విద్యాసంస్థల తాట తీస్తా

- విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటారా
- బంద్ పెట్టి బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తానంటే ఎలా
- విద్యార్థుల అకడమిక్ ఇయర్ లాస్‌కు ఎవరు బాధ్యులు
- ఫీజులు ఇష్టానుసారం పెంచి రియంబర్స్‌మెంట్‌పై ఒత్తిడి
- రాజకీయ పార్టీల ఉచ్చులో పడి బెదిరిస్తే ఊరుకునేది లేదు
- ప్రైవేట్ విద్యాసంస్థల తీరుపై సిఎం రేవంత్ ఘాటు హెచ్చరికలు

హైదరాబాద్,తెలంగాణ దిశ: ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకులు తమాషా చేస్తే తాటతీస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటే ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చారు. విద్య అనేది సేవ.. వ్యాపారం కాదని స్పష్టం చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలు సేవ చేయడం లేదు.. వ్యాపారం చేస్తున్నాయని సీరియస్ అయ్యారు. శుక్రవారం గాంధీభవన్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు నష్టం కలిగిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఫీజు రీయంబర్స్ మెంట్‌పై ప్రైవేటు విద్యాసంస్థలు బ్లాక్‌మెయిల్ చేస్తున్నాయని ధ్వజమెత్తారు.



## ఎల్బీ స్టేడియంలో బహిరంగ సభకు నిరాకరణ..!

హైదరాబాద్,తెలంగాణ దిశ : హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో తెలంగాణ అధ్యాపకుల సాంత్వన సభ పేరిట ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ఈ నెల 8న నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభకు పోలీసులు పర్మీషన్ ఇచ్చేందుకు నిరాకరించారు. సభకు అనుమతించాలని సమాఖ్య ప్రతినిధులు హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా.. నగరంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉందని అనుమతిని నిరాకరిస్తూ ఇవాళ పోలీస్ కమిషనర్ కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. ఈ నేపథ్యంలోనే ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ప్రతినిధులు కీలక నిర్ణయం తీసుకున్నారు. సభ నిర్వహణకు హైదరాబాద్ పోలీసులు అనుమతులిచ్చేలా ఆదేశాలు ఇవ్వాలంటూ హైకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. అయితే, భోజన విరామం తర్వాత ఆ పిటిషన్ ధర్మాసనం ఎదుట విచారణకు రానుంది.



## ఇక్కడ పంచాయతీలు చెప్పబడును!

### పెద్దమనుషులకు కమిషన్, మద్యం ఇస్తే చాలు..?

- ఖనిలో కుల సంఘాల ముసుగులో పంచాయతీ పెద్ద మనుషులు
- కుల సంఘాల పెద్ద మనుషులకు వైట్ కలర్ ఉద్యోగం
- రాష్ట్రంలో ఎక్కడైనా, ఎలాంటి పంచాయతీ అయినా చెప్పబడును

గోదావరిఖని,తెలంగాణ దిశ : గోదావరిఖని ప్రాంతంలో కుల సంఘాల ముసుగులో ఇక్కడ పంచాయతీలు చెప్పబడును అంటూ తెల్లవారితే చాలు తెల్ల చొక్కాలు వేసుకొని ముగ్గురు నలుగురు బండమీద తిరుగుతూమేము ఎలాంటి పంచాయితీ అయినా చెప్పగలుగుతాం కుటుంబ పంచాయతీ, అన్నదమ్ముల పంచాయతీ, భూముల పంచాయతీ, పెళ్లిళ్ల, భార్యాభర్తల పంచాయతీ, ఇంటి పక్కన వారితో గొడవ అయినా ఏలాంటి పంచాయి తీ అయినా మమ్మల్ని పిలవండి మేము క్షణాల్లో పరిష్కరిస్తాం. మాకు నిత్యం మందు, కమిషన్ ఇస్తే చాలు గోదావరిఖని ప్రాంతంలో కుల సంఘాల ముసుగులో కొందరు వైట్ కాలర్ పెద్ద మనుషులు తెల్లవా రింది మొదలు ఇదే ఉద్యోగంలా పెట్టుకొని పంచాయతీ వేటలో పడు తున్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా పర్వాలేదు ఫోన్ చేస్తే చాలు పంచాయతీ చేస్తాము అంటున్నారని బాధితులు మొరపెట్టుకుంటున్నారు.



## రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో వీధికుక్కలు ఉండకూడదు

- పెరుగుతున్న కుక్కకాటు ఘటనలపై సుప్రీంకోర్టు ఆందోళన
- వీధికుక్కలను పట్టుకునేందుకు జాయింట్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశం
- జాతీయ, రాష్ట్ర రహదారుల నుంచి పశువులను తొలగించాలన్న సుప్రీం
- పట్టుకున్న పశువులను షెల్టర్ హోమ్‌లకు తరలించాలని సూచన

న్యూఢిల్లీ, నవంబర్7 : దేశవ్యాప్తంగా వీధికుక్కలు, రహదారులపై తిరిగే పశువుల నియంత్రణపై సుప్రీంకోర్టు తాజాగా కీలక ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ఆసుపత్రులు వంటి ప్రజా ప్రాంగణాల్లో కుక్కకాటు ఘటనలు ఆందోళనకరంగా పెరుగుతున్నాయని పేర్కొంటూ, ఆయా ప్రాంతాలను వీధికుక్కల రహితంగా మార్చాలని అధికారులను ఆదేశించింది.

# అన్ని అనుమతులతో వైన్స్ ఏర్పాటు

## - అయిన అడ్డా కూలీలతో ధర్నాలు....!







**నాగారం, నవంబర్ 07, (తెలంగాణ దిశ)** :అన్ని ప్రభుత్వ అనుమతులతోనే వైన్స్ ను ఏర్పాటు చేస్తున్నామని నాగారం రాంపల్లిలో వైన్స్ ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు పవన్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎంకేజీ 73 నాగారం వైన్స్ నెంబర్ వన్ తమకు లక్కీ డ్రా లో వచ్చిందని తెలిపారు. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ నియమ నిబంధనల మేరకు వైన్స్ ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకోసం ఎక్సైజ్ శాఖకు లైసెన్సు ఫీజు చెల్లించామని తెలిపారు. నిబంధనల ప్రకారం 100 మీటర్ల లోపు స్కూలు, దేవాలయం, హాస్పిటల్ లేకుండా వైన్స్ ను ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఇదే నాగారంలో 30, 40 ఫీట్ల రోడ్డులో వైన్సులు ఏర్పాటు చేశారని తెలిపారు. రోడ్డు స్పేస్ కు 10 ఫీట్లు లేకుండా ఇదే నాగారంలో నాలుగు వైన్సులు కొనసాగుతున్నాయన్నారు. పాఠశాలలకు దగ్గరగా వైన్సులు ఏర్పాటు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.
కొందరు రాజకీయ దురుద్దేశంతో వైన్స్ ఏర్పాటు చేయకుండా అడ్డుపడుతున్నారని విమర్శించారు. సత్యనారాయణ కాలనీవాసుల అభ్యంతరాలను తొలగిస్తామని చెప్పారు.
ఇందులో భాగంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని, ఈ సీసీ కెమెరాలు యాక్సెస్ ను కీసర పోలీస్ స్టేషన్ కు ఇస్తామని తెలిపారు. తమ వైన్స్ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న వారు శ్రీ చైతన్య ఈ టెక్నో స్కూల్ సమీపంలోనే వైన్స్ ఏర్పాటు చేశారని, ఇది కూడా సత్యనారాయణ కాలనీలోనే ఉందన్నారు. కొత్త వైన్స్ వస్తుంటే ఓర్వలేక అడ్డా కూలీలతోధర్నా చేయిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం వైన్స్ ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు.

# ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రాధికా చౌరస్తాలో సామూహిక వందేమాతర గీతాలాపన





**ఏఎస్ రావునగర్, నవంబర్ 07, (తెలంగాణ దిశ)** :ప్రముఖ కవి బంకించంద్ర ఛటర్జీ మనోమథనంలో ప్రభవించి స్వాతంత్ర్యం సమర నినాదమై భారతీయ స్వాభిమాన గీతమైన వందేమాతరం గీతానికి 150 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా ఏఎస్ రావునగర్ డివిజన్ రాధికా చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో వందే మాతర గీతం సామూహిక ఆలాపన చేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి జోన్ ట్రాఫిక్ఏసిపి ఎం. ప్రభాకర్ రెడ్డి, కుషాయిగూడ సీఐలు రామ లక్ష్మణ రాజు, సీఐ రుద్వీర్ కుమార్, ఎస్ఐలు భాస్కర్, లింగారెడ్డి, ఎఎస్ఐలు యేసు రత్నం ఆరోగ్య రాజు, పర్వతాలు పాల్గొన్నారు.

# జీడికల్ శ్రీ రామాలయంలో ప్రత్యేక పూజలు





**చర్లపల్లి, నవంబర్ 07, (తెలంగాణ దిశ) :** కార్తీక మాసం సందర్భంగా చర్లపల్లి డివిజన్ రెడ్డి కాలనీకి చెందిన భజన బృందం ఆధ్వర్యంలో జనగాం జిల్లా జీడికల్ శ్రీ రామచంద్ర స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. చక్రిపురం చౌరస్తాలోని శ్రీరామ్ బేకర్స్ అండ్ స్వీట్స్, శ్రీరామ్ ఫుడ్స్ అధినేత కట్కూరి సుధా విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 30 మంది మహిళలతో కూడిన భజన బృందం ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భజన, కోలాటాలతో భక్తి భావాన్ని చాటారు. అనంతరం కార్తీక మాస వనభోజనాలు నిర్వహించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పులకరింప జేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీ రామచంద్ర స్వామి వారి సాంప్రదాయ పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా భజన బృంద సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో శ్రీ రామచంద్ర స్వామి దర్శనం పొందడం తమకు అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తి గీతాలతో మార్మోగింది. ఈ సందర్భంగా కట్కూరి సుధా విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా జీడికల్ లోని 400 సంవత్సరాల నాటి రామాలయంలో స్వామివారిని దర్శనంతో పాటు సేవ చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. మహిళల్లో భక్తి భావం పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

# చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతం

## - జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి పిట్టల నాగరాజు





**చర్లపల్లి, నవంబర్ 07, (తెలంగాణ దిశ) :**జనవిజ్ఞాన వేదిక కాప్రా మండల కమిటీ ఆధ్వర్యంలో కాప్రా మండల పరిధిలో 45 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 8, 9, 10 వ తరగతి చెందిన 8500 మంది విద్యార్థిని, విద్యార్థులతో పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను 2025ను నిర్వహించామని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి పిట్టల నాగరాజు తెలిపారు. చర్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆదినారాయణ ఉపాధ్యాయులతో కలిసి వారు చెకుముకి సైన్ సంబరాలు 2025 ప్రశ్నపత్రాన్ని విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెకుముకి సైన్ సంబరాలు విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచేందుకు, శాస్త్రీ అవగాహనను దృక్పథాన్ని పెంచేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని వారన్నారు. ఈ నెల 21 తేదీన జరిగే మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు ప్రతి ఒక్క పాఠశాల నుండి తరగతికి ఒక్కరు చొప్పున ముగ్గురు తమ పాఠశాలకు ప్రతినిత్యం వహిస్తూ మండల స్థాయి టాలెంట్ టెస్టులో పాల్గొంటారని వారన్నారు. ఈ చెకుముకి సైన్ సంబరాలు విజయ వంతంలో భాగస్వాములైన వివిధ పాఠశాలలో యజమాన్యాలకు, ఉపాధ్యాయులకు జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో వందే మాతరం గేయం సామూహిక గానం



**కుషాయిగూడ, నవంబర్ 07,(తెలంగాణ దిశ):**వందే మాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జరుగు తున్న ఉత్సవాలలో భాగంగా కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సామూహిక వందేమాతర గానం కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు రెండు వందల మంది నారాయణ స్కూల్ విద్యార్థులు, స్థానిక పౌరులు, కుషాయిగూడ ఎసిపి వై. వెంకట్ రెడ్డి, కుషాయిగూడ సర్కిల్ ఇన్ స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డి , సబ్ ఇన్ స్పెక్టర్లు సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్, విజయ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కుషాయిగూడ ఏసిపి వై. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ వందేమాతరం గేయం యొక్క చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు. స్కూల్ విద్యార్థులు ఈ దశ నుండే చట్టాలను గౌరవిస్తూ దేశంపై భక్తి, గౌరవం కలిగి ఉండాలని సూచించారు.



# కలెక్టరేట్‌లో సామూహికంగా 'వందేమాతరం' గీతాలాపన





**(మేడ్చల్ జిల్లా ప్రతినిధి, తెలంగాణ దిశ) :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 'వందేమాతరం' జాతీయ గీతాన్ని బంకిమ్ చంద్ర ఛటర్జీ రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో వందేమాతర గీతాన్ని శుక్రవారం సామూహికంగా ఆలపించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియతో కలిసి ఈ జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమం లో జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, టీఎస్ఎస్ కళాకారులతో పాటు పలువురు ఇతర ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

## - నెమలి అనిల్ కుమార్

మల్లాపూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల్లో వేగం పెంచి సత్వరంగా పూర్తి చేయాలని కోరుతూ కాప్రా సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) నాగేందర్ ను గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ కోరారు. ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని మల్లాపూర్ డివిజన్ లో జరుగుతున్న సిసి రోడ్లు, బీటీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులపై కాప్రా సర్కిల్ కార్యాలయంలో ఈఈని కలిసి పనులు సకాలంలో పూర్తి చేయాలని కోరారు.
**(మల్లాపూర్, తెలంగాణ దిశ)**



# వైఫల్యాల నుండి నేర్చుకోవాలి... క్రమశిక్షణతో లక్ష్యాలు సాధించాలి

## మౌలాలి కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్







**ఈసీఐఎల్, మౌలాలి, నవంబర్ 07, (తెలంగాణ దిశ) :** శ్రీ మేధా వి జూనియర్ కళాశాలలో ఈసీఐఎల్ సహకారంతో గురువారం 'స్పార్క్' పేరుతో నిర్వహించిన సాంస్కృతిక ఉత్సవం అంబరాన్ని తాకింది. ఈ వేడుకకు మౌలాలి కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు జీవితంలో ఎదురయ్యే వైఫల్యాలను పాఠాలుగా స్వీకరించి, వాటిని అధిగమించేందుకు ధైర్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. యువత తప్పనిసరిగా తల్లిదండ్రులు, గురువుల మాటలను గౌరవించి వినాలని సూచించారు. కళాశాలలో ఎక్కువ సమయం గడపడం వలన, అధ్యాపకుల నుంచి క్రమశిక్షణ, నిజాయితీ వంటి విలువైన జీవితాంశాలను ఎక్కువగా నేర్చుకోవాలన్నారు. సమాజంలో పెరిగిపోతున్న అనైతిక అలవాట్లకు దూరంగా ఉండాలని, ఈ రెండు ప్రధాన లక్షణాలతో ముందుకు సాగి తమ జీవిత లక్ష్యాలను చేరుకోవాలని ఆమె ఉద్బోధించారు. చదువుతో పాటు నైతిక విలువలను పెంపొందించుకోవాలని ఆమె విద్యార్థులను కోరారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు కార్పొరేటర్ బహుమతులు అందజేశారు.
విద్యార్థులు ప్రదర్శించిన ఆకర్షణీయమైన సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సోమ రవికుమార్, ప్రిన్సిపాల్ సోమ స్రవంతి, ప్రవీణ్, ఇతర ఉపాధ్యాయులు, కళాశాల ఇంచార్జీలు పాల్గొన్నారు.

# పడక గదిలో సీసీ కెమెరాలు..

తిరుపతి:ఒక మనిషిని గెలవాలంటే నేరుగా తలపడాలి. యుద్ధక్షేత్రంలో ప్రత్యర్థిని ఓడించాలంటే ముందుగా మన సత్తా ఏమిటో చూపించాలి. అలాకాకుండా వెన్నుపోటు పొడిచి.. దొడ్డి దారి ప్రణాళి కలు రూపొందిస్తే దానిని యుద్ధ రీతి అనరు. ఇటువంటి విధానాన్ని అమలు చేసిన ఓ రాజకీయ నాయకుడు ఇప్పుడు తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటున్నాడు. విపరీతమైన విమర్శలను చవిచూస్తున్నాడు. తట్టు కోలేక రాష్ట్రానికి దూరంగా ఉంటున్నాడు.ఆ రాజకీయ నాయకుడికి బలమైన నేపథ్యం ఉంది. ఆయన తండ్రి మంత్రిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం ఆ నాయకుడు ఎమ్మెల్యేగా పనిచేస్తున్నారు.. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ అధికారంలో ఉంది. ఆ నియోజకవర్గ ప్రజలు దీవించారు కాబట్టి ఆయన ఎమ్మెల్యే అయ్యారు. మరోసారి ఆయన గెలవాలంటే గొప్ప పనులు చేయాలి. ప్రజల మనసులో స్థిరమైన స్థానాన్ని సంపాదించుకోవాలి. అవసరమైతే తనకు శత్రుత్వం అనేది లేకుండా.. ప్రత్యర్థి అనే వ్యక్తి ఉండకుండా చూసుకోవాలి. ఇవన్నీ జరగాలంటే ముందుగా ఆ రాజకీయ నాయకుడిలో మంచి తనం ఉండాలి. కానీ ఎమ్మెల్యే గా గెలిచిన ఆ నాయకుడిలో మంచిత నం అనేది లేకుండా పోయింది. ముంచేతనం అనేది పెరిగిపోయింది. అన్నిటికంటే ముఖ్యంగా తనకు ప్రత్యర్థిగా ఉన్న ఒక మహిళపై పైశాచికత్వాన్ని ప్రదర్శించిన తీరు ఇప్పుడు ఆ రాష్ట్ర రాజకీయాల్లోనే సంచలనంగా మారింది.ఆమె ఉన్నత విద్యావంతురాలు. తన నియోజకవర్గానికి సేవ చేయడానికి రాజకీయాలలోకి వచ్చారు. అంతేకాదు సేవా కార్యక్రమాలు కూడా విస్తృతంగా చేశారు. డబ్బు కూడా భారీగా ఖర్చు పెట్టారు. ఆమె భర్త కూడా ఇందుకు సహకరించారు. అయితే ఆమెకే టికెట్ అనుకుంటున్న క్రమంలో.. ఊహించిన విధంగా పొత్తు ఏర్పడింది.. దీంతో ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ పొత్తు ధర్మంలో భాగంగా భాగస్వామ్య పార్టీకి సపోర్టు ఇవ్వాల్సి వచ్చింది. దీంతో ఆమెకు ఎమ్మెల్యే యోగ్యం దక్కలేదు. సరే తమతో పొత్తు కుదుర్చుకున్న పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలిచారని.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామని ఆమె గొప్పగా చెప్పుకుంది. అంతేకాదు అధికారంలోకి తమ పార్టీ భాగస్వామిగా ఉన్న సమూహం రావడంతో ఆనందపడింది. కానీ ఇక్కడే ఆమె ఆనందం ఆవిరైంది. దానికి ప్రధాన కారణం ఆ నియోజకవర్గంలోని ఎమ్మెల్యే నే.ఎమ్మెల్యే గెలిచిన తర్వాత ఆ నాయకుడి ప్రవర్తన పూర్తిగా మారిపోయింది. వచ్చే ఎన్నికల నాటికి తనకు రాజకీయ శత్రుత్వం ఉండకూడదని ఆయన భావించాడు. అందువల్లే తమ సమూహంలో ఉన్న పార్టీకి సంబంధించిన నాయకురాలికి అసలు రాజకీయ జీవితంలో లేకుండా చేయాలని అనుకున్నాడు. ఆమె దగ్గర పని చేస్తున్న ఒక వ్యక్తిని దగ్గరికి తీసుకున్నాడు. డబ్బు ఆశ చూపించాడు. అయితే ఆ నాయకురాలికి మరొక వ్యక్తితో సంబంధం ఉండేది. ఇదే అదునుగా భావించిన ఆ ఎమ్మెల్యే ఆ నాయకురాలి వద్ద పనిచేస్తున్న వ్యక్తితో చేయకూడని కార్యక్రమాలు చేయించాడు. ఆ నాయకురాలు పడకగదిలో సీసీ కెమెరాలు పెట్టించాడు..

# సంపాదకీయం

## ఆసక్తికరంగా పాలిట్రిక్స్..

రాజకీయాలు ఎప్పుడు ఎలా మారతాయో తెలియదు. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రు లు ఉండరనే నానుడి దశాబ్దాలుగా విం టూనే ఉన్నాం. భారత రాజకీయాల్లో అనే క మార్లు ఇది రుజువైంది. రెండు పార్టీల మధ్య పొత్తు కానీ, పలు పార్టీలు కలిసి కూ టమి ఏర్పాటు చేయడం, రాజకీయ అవసరాల కోసం రాత్రికి రాత్రి నాయకులు కండువాలు మార్చడం పరిపాటైపోయిం ది. ఇక్కడ స్నేహం, మోజు లాంటివి ఉండ వు.జాతీయ, రాష్ట్ర రాజకీయాల్లో ఫిరాయింపుల సునామీ వేగంగానే సంభవిస్తుం టాయి. ఈ మార్పుల గురించి ప్రజలు పట్టించుకోవడం మర్చిపోయారు. అయితే ఇప్పుడు బీహార్ ఎన్నికల దృష్ట్యా దేశం చూపు మొత్తం అటు వైపే మళ్లింది. ఈ రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు అధికార, ప్రతిపక్ష కూటములకు కీలకంగా మారాయి. బీహార్‌లో అధికారాన్ని హస్తగతం చేసుకోడానికి కాంగ్రెస్, ఆర్జేడీ, జేఎం ఎం, ఇతర పార్టీలతో కలిసి 'మహాఘట్ బంధన్' కూటమిగా ఏర్పడింది.ఈ దఫా అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకోవాలని కృతనిశ్చయంతో ఈ కూటమి పావులు కదుపు తుంది. మరోవైపు అధికార ఎన్డీఏ కూట మి సీట్ల పంపకంలో చాణక్యత ప్రదర్శించింది. ప్రతిపక్ష మహాఘట్ బంధన్ కూట మికి సీట్ల పంపకంలో తేడాలు వచ్చి ఊ హించని విధంగా బీహార్ ఎన్నికల్లో కొత్త పంచాయతీ తెరపైకి వచ్చింది.ఏకంగా మ హా కూటమి నుంచి జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) వైదొలిగిందనే ప్రచా రం జోరుగా జరుగుతుంది. ఇదే జరిగితే అధికార కూటమికి కలిసి వచ్చే అంశంగా చెప్పవచ్చు. ఇక జేఎంఎం పార్టీ బీహార్‌లో ఆరు అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టనున్నట్లు స్పష్టం చేసింది. ఒకవేళ కూటమి నుంచి బయటకు వచ్చినా, 2025 అసెంబ్లీ ఎన్నికలకు ముందు మహా కూటమితో జేఎంఎం తెగతెంపులు చేసుకున్నా ఒక ముఖ్యమైన పరిణామంగా మా రబోతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.బీహార్‌లో ఇప్పటికే ఎన్నికల వాతావరణం వేడెక్కింది. తాజాగా మహాకూట మిలో సీట్ల పంపకాల అంశం మరింత వేడిని పెంచింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో రోజురోజుకు పరిణామాలు మారు తూ వస్తున్నాయి. ఇప్పటికే మొదటి విడత ఎన్నికలకు సంబంధించిన నామినేషన్లు వేసిన ఎన్డీయే ఎన్నికల ప్రచారంలో దూ సుకుపోతుంది. కానీ మహాఘట్ బంధన్‌లో మాత్రం సీట్ల పంచాయతీ నేటికి తెగ లేదు. ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీలు పరస్పరం సీట్ల విషయంలో విభేదాలు తలెత్తడంతో కూటమిలో అసహజ పరిస్థితి నెలకొంది.కాంగ్రెస్‌కు కేటాయించిన కొన్ని స్థానాల్లో ఆర్జేడీ నాయకులు తమ అభ్యర్థులను నిలబెట్టడం తీవ్ర అసహనానికి దారితీసింది. ముఖ్యంగా బీహార్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ రామ్ కుటుంబ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఆర్జేడీ అభ్యర్థి నా మినేషన్ దాఖలు చేయడం ఉద్రిక్తతను పెంచింది. ఇదే సమయంలో, జార్ఖండ్ ముక్తి మోర్చా కూడా అసంతృప్తి వ్యక్తం చేసింది. కూటమిలో తగిన సీట్లు దక్కకపోవడంతో బీహార్ ఎన్నికల్లో ఒంటరిగా బరి లోకి దిగుతామని ఆ పార్టీ ప్రకటించింది.నియోజకవర్గాల్లో తమ అభ్యర్థులను దింపనున్నట్లు జేఎంఎం నేతలు వెల్లడించారు. కానీ తెల్లారే సరికి జేఎంఎం పోటీ నుంచి తప్పుకున్నట్లు ప్రకటించడం ఆశ్చర్యపరిచింది. ఎన్నికల సమయంలో పాత పొత్తుల భగ్నం, కొత్త పొత్తులు ఏర్పడడం షరామామూలే. 'మహాఘట్ బంధన్' కూటమిలో సీట్ల పంచాయతీ చర్చలు ఇం కా స్పష్టతకు రాకపోవడంతో, ఆర్జేడీ??కాంగ్రెస్ మధ్య అవిశ్వాస వాతావరణం ఏర్ప డుతుంది. ఈ విభేదాలు పరిష్కారం కాకపోతే, రాబోయే ఎన్నికల్లో మహా కూటమి ప్రభావం తగ్గే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.బీహార్ రాజకీయ రంగంలో వంశపారంపర్య పార్టీల ఆధిపత్యం కొనసాగు తోంది. ఎన్నికల సమయంలో వారసత్వ రాజకీయాలను ప్రచారాస్త్రంగా మార్చుకుని ప్రత్యర్థులపై విరుచుకుపడడం చూ స్తుంటాం. కానీ బీహార్‌లో మాత్రం అలాం టి దాడికి తావులేదు. అన్ని రాజకీయ పా ర్టీలు ఇలాంటి వారసత్వ రాజకీయాలు పు ణికి పుచ్చుకున్నవే. అధికార బీజేపీ, జేడీ యూ మొదలుకొని ఆర్జేడీ సహా అన్ని పార్టీలది అదే తీరు.అభ్యర్థుల్లో గణనీయమైన సంఖ్యలో స్థిరపడిన రాజకీయ నా యకుల కుమారులు, కుమార్తెలు, భార్య లు, దగ్గరి బంధువులు ఎక్కువగా ఉన్నా రు. రాఘోపూర్ నుంచి ఆర్జేడీకి చెందిన తేజస్వి యాదవ్ (లాలూ వారసుడు), తా రాపూర్ నుంచి బీజేపీకి చెందిన సామ్రాట్ చౌదరి (మాజీ మంత్రి శకుని చౌదరి కుమారుడు), రఘునాథ్‌పూర్ నుంచి ఆర్జేడీకి చెందిన ఒసామా షాహాబ్ (దివంగత మహ్మద్ షాబుద్దీన్ కుమారుడు) ఉన్నా రు.ఈ అసెంబ్లీ ఎన్నికల సమరానికి 'సై' అంటున్నారు. పార్టీల్లో వారసుల తీరును చూస్తుంటే సైద్ధాంతిక నిబద్ధత రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య సూత్రాలను వా రు పెద్దగా పట్టించుకోవడం లేదనే విష యం స్పష్టంగా తెలుస్తోంది. ఎన్డీఏ కూట మి చాప కింద నీరులా ప్రచారంలో దూ సుకుపోతున్నది.నితీశ్ ఆశలు అన్నీ కూడా జేఎంఎం కలయిక బెడిసికొట్టి కలిసి వస్తుందనే ఆశాభావంతో ఎదురు చూస్తున్నది. అయితే బీహార్ ఎన్నికల్లో మహా కూ టమి నుంచి జేఎంఎం పార్టీ బయటికి వచ్చినట్లు ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. రాష్ట్రంలో విద్యకు సరైన ప్రాధాన్యం కల్పించక పోవ డం వల్లనే సామాజిక స్పృహ లేక ఈ పరిస్థితి తలెత్తిందని అభిప్రాయప డ్డారు.లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీ దేవి నేతృత్వంలోని ఆర్జేడీ దుష్పరిపాలన తర్వా త రాష్ట్రం ఎదుర్కొన్న గందరగోళం నుంచి బీహార్‌ను బయటకు తీసుకురావడంలో ప్రస్తుత సీఎం నితీశ్ కుమార్ విఫలమయ్యారు. బీహార్ ఆర్థిక వ్యవస్థ స్తబ్దంగా ఉందని, క్షీణించిందని ఆర్థికవేత్తలు వాదిస్తున్నారు. బీహార్ ఎన్ఎస్‌డీపీ ఇప్పటికీ జాతీయ సగటులో మూడింట ఒక వంతు పడిపోయింది.నితీశ్ కుమార్ ప్రభుత్వం 12 లక్షల ఉద్యోగాలను సృష్టిస్తామని ప్రకటించినప్పటికీ 2023లో పట్టణ ప్రాం తాల్లో రాష్ట్ర నిరుద్యోగిత రేటు 10.2 శాతం గా ఉ ంటే.. గ్రామీణ నిరుద్యోగం దాదాపు 7.8 శాతంగా ఉంది. ఇది జాతీయ సగటు కంటే చాలా ఎక్కువ. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ను మెరుగుపరచడంలో, ఉద్యోగాలను సృష్టించడంలో, పెట్టుబడులను తీసుకురావడంలో బీహార్‌లో కుంటుపడుతున్న పేద రికాన్ని అంతం చేయడంలో ఆయన పూర్తి గా విఫలమయ్యారు.పాలనలో బీహారీలు రాష్ట్రంలో జీవనాధార రాబడిని ఇచ్చే వ్య వసాయానికి తిరిగి వెళ్లారు. లక్షలాది మం ది కార్మికులు వివిధ రాష్ట్రాల్లో వలసలు వెళ్లి పొట్ట గడుపుకుంటున్నారు. పారిశ్రామిక అభివృద్ధి నితీష్ కుమార్ అతిపెద్ద వైఫల్యాల్లో ఒకటి. అనేక పెట్టుబడి శిఖరా గ్ర సమావేశాలు, విధాన సవరణలు ఉన్నప్పటికీ, బీహార్ పారిశ్రామికంగా వెనుకబ డిన రాష్ట్రంగా మిగిలిపోయింది.'బీహార్‌లో గ్రామీణ జనాభా విద్యా స్థాయి చా లా తక్కువ, జనాభాలో 14.71 శాతం మం ది మాత్రమే 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. అందుకే రాజకీయంగా అవగా హన లేమి బీహార్‌లో ఎక్కువగా కనిపిస్తుంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార యాత్ర' లో బీజేపీ, ఆర్ఎస్ఎస్, ఎన్నికల కమిషన్ కలిసి ఓట్ల చోరీకి పాల్పడుతున్నాయని ఆధారాలతో బయటపెట్టారు. మరోవైపు ఆర్జేడీ 143 మంది అభ్యర్థులను ప్రకటించి ప్రచారంలో దూ సుకుపోతుంది.కాంగ్రెస్ 55 సీట్లతో సర్దుకొని మిగతా సీట్లు మిత్రులకు కేటాయిం చడం జరిగింది. కానీ కొన్ని సీట్లలో స్నేహపూర్వక పోటీ మళ్లీ అధికార పార్టీకి ఎక్కడ కలిసి వస్తుందోనని కాంగ్రెస్ జాగ్రత్త వహిస్తుంది. కాగా ప్రస్తుత సీఎం నితీశ్ కుమా ర్‌కు ఈ ఎన్నికల్లో గడ్డు పరిస్థితి ఉండే అవకాశం ఉందని ప్రీ పోల్ సర్వేలు పేర్కొంటు న్నాయి.బీహార్ ఫలితాలు కాంగ్రెస్‌కు జీవన్మరణ సమస్యగా మారింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే, ఇండియా కూ టముల మధ్య హోరాహోరీ పోరు కొనసాగుతోంది.

# శాంతి ఒప్పందానికి తూట్లు



రెండేళ్ల పాటు పాలస్తీనాపై విరుచుకుపడి, 68 వేలమందిని పొట్టన పెట్టుకున్నా ఇజ్రాయెల్ రక్తదాహం తీరలేదు. 20 సూత్రాల శాంతి పథకం పేరిట యుద్ధ విరమణ ప్రకటించాక కూడా నయవంచనకు పాల్పడుతోంది. నరమేధానికి తెగబడుతోంది. యుద్ధ విరమణ చేయించానని గప్పాలు కొట్టుకున్న అమెరికా అధినేత ట్రంప్ ఈ దాష్టీకాన్ని, దారుణాలనూ చూస్తూ ఊరుకుంటున్నారు తప్ప %-% మాట తప్పుతున్న మతిమాలిన చర్యలపై కిమ్మనటం లేదు. యుద్ధం ముగించామని చెప్పిన కొద్ది గంటల వ్యవధిలోనే ఇజ్రాయెల్ మిలటరీ పాలస్తీనా పౌరులపై కాల్పులకు బరి తెగించింది. యుద్ధం ముగిసిందని సంబరపడి సొంతూరుకు వస్తున్న ఒక కుటుంబంపై కాల్పులు జరిపి, 11 మంది ప్రాణాలు బలిగొంది. అన్ని రకాల అంతర్జాతీయ సూత్రాలను, మానవతా విలువలను కర్కశంగా అణగదొక్కి నెతన్యాహు నేతృత్వంలోని ఇజ్రాయెల్ యుద్ధ కావరం ప్రదర్శిస్తూనే ఉంది. తన ఉన్మాదపు దాడుల్లో ఆసుపత్రులు ధ్వంసమైనా, పాఠశాలలు కుప్పకూలినా, వేలాది మంది పసిపిల్లలు ప్రాణాలు కోల్పోయినా, అమాయక పౌరులు బలైనా %-% ఈ రెండేళ్ల కాలంలో ఒక్క చిన్న పశ్చాత్తాప ప్రకటన కూడా చేయలేదు. కళ్లు మూసుకొని విచక్షణారహితంగా రక్తపాతం సృష్టిస్తూనే ఉంది. ఈ మారణకాండను ఐక్యరాజ్య సమితి తప్పు పట్టింది. అంతర్జాతీయ నేరవిచారణ న్యాయస్థానం నెతన్యాహుపై అరెస్టు వారంటు జారీ చేసింది. ఐక్యరాజ్య సమితి సమావేశాల్లో అతడు మాట్లాడబోతుంటే- అనేక ప్రపంచ దేశాలు వేదికను బహిష్కరించాయి. ప్రపంచవ్యాప్తంగా పౌర సమాజం తీవ్రంగా ప్రతిస్పందించింది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ సహా అన్ని దేశాల్లో లక్షలాది మంది వీధుల్లోకి వచ్చి, ఇజ్రాయెల్ దుర్మార్గ దాడులను ఖండిస్తూ- పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనలు నిర్వహించారు. అయినా, ఆ దేశం కళ్లు తెరవలేదు. కనీస మానవతా దృక్పథాన్ని ప్రదర్శించలేదు. పాలస్తీనా పట్ల అత్యంత కర్కశంగా, అమానవీయంగా వ్యవహరించింది. ఆకలితో అల్లాడుతున్న పిల్లలు ఆహార ట్రక్కుల వద్దకు అర్రులు చాచి పరుగులు పెడితే- బాంబులు కురిపించింది. మానవతా సాయం అందిస్తున్న ఐక్యరాజ్యసమితి సిబ్బంది పైనా, గాజా దుర్భర స్థితిని బయటి ప్రపంచానికి నివేదిస్తున్న విలేకరులపైనా కాల్పులకు తెగబడింది. సుమారు 300 మంది విలేకరులను, 1700 మంది వైద్య సిబ్బందిని పొట్టన పెట్టుకొంది. ఒకప్పుడు హిట్లర్ జాత్యాహంకారానికి బలైన ఇజ్రాయెల్ ఈనాడు ఇంతగా బరితెగించటానికి దాని దురాక్రమణ కాంక్ష ఒక్కటే కాదుబీ సామ్రాజ్యవాద అమెరికా వంత కూడా కారణమే! యుద్ధవిరమణ ప్రకటన తొలి రోజు నుంచే ఉల్లంఘనకు గురవ్వటానికి టెల్ అవీవ్‌తో పాటు వాషింగ్టన్ కూడా బాధ్యత వహించాల్సిందే!

వాస్తవానికి 20 సూత్రాల పథకం పేరుకే శాంతిమంత్రం. ఇజ్రాయెల్ ఆధిపత్యానికి, దురాక్రమణ దాష్టీకానికి చెల్లుచీటి రాసే నిబంధన అందులో ఒక్కటీ లేదు. ఇజ్రాయెల్ మిలటరీ పాలస్తీనాలో ఇంకా తిష్ట వేసుకునే ఉంది. దురాక్రమించిన గాజా భూభాగంలోని 53 శాతాన్ని తన గుప్పిట్లోనే పెట్టుకొంది. తనకు ఇచ్ఛ కలిగిన ప్రతి రోజూ కాల్పులు జరుపుతూనే ఉంది. అనుమానం వచ్చిన లక్ష్యాలపైనే తమ దాడులు కొనసాగుతున్నాయని నెతన్యాహు నిస్సిగ్గుగా ప్రకటించటం, విరమణ అనంతర హత్యలను సమర్థించుకోవటం ఎంత అమానుషం! హమాస్ నిరాయుధం అయ్యేదాకా తమ కత్తులు గాజా మెడపై వేలాడుతూనే ఉంటాయని ఇజ్రాయెల్ హూంకరించటం %ొ% ఎలాంటి శాంతిస్థాపనో ఒప్పందంపై గొప్పలు వల్లిస్తున్న అమెరికా వివరించాలి.

గాజాను నిర్మానుష్యం చేసి, దానిని చెరబట్టటమే వ్యూహంగా ఇజ్రాయెల్ సాగుతున్నట్టు కనిపిస్తోంది. యుద్ధ విరమణ అనేది నిబద్ధత లేని ఒక ప్రహసనంగా గడచిన ఇరవై రోజుల్లో తేలిపోయింది. గతంలో కాల్పుల విరమణ సందర్భంలోనూ ఇజ్రాయెల్ ఇలాంటి ఏకపక్ష ఉల్లంఘనలకే పాల్పడింది. నిజంగానే శాంతిస్థాపన చేయాలనుకుంటే - ఇజ్రాయెల్ యుద్ధకావరానికి గట్టి కళ్లెం వేయాలి. అమెరికా, బ్రిటన్ వంటి అగ్రదేశాలు ఉదాసీన వైఖరిని విడనాడాలి. శాంతిస్థాపన అనేది స్విచ్ బటన్ లాంటిది కాదు. అదొక నిరంతరమైన దౌత్య ప్రక్రియ. తీవ్రమైన విద్వేషానికి, విధ్వంసానికి గురైన పాలస్తీనాకు తన భూభాగం మీద సర్వ స్వతంత్రత కల్పించి, ప్రపంచ దేశాలు అండదండగా నిలబడాలి.

# అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల,తెలంగాణ దిశ :**మున్సిపాలిటీల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి రిజిస్టర్లు, మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి వివరాలు పారిశుధ్య నిర్వహణ అంశాలను మున్సిపల్ కమిషనర్ రాజు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. అంతర్గత రహదారులు మురుగు కాలువల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని పారిశుధ్య నిర్వహణలో భాగంగా వార్డులలోని ప్రతి ఇంటి నుండి ప్రతి రోజు తడి చెత్త, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని తెలిపారు. ప్రతి ఇంటికి ఎలాంటి అంతరాయం లేకుండా త్రాగునీరు సరఫరా చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నర్సరీలలో నాటేందుకు అవసరమైన మొక్కలను అభివృద్ధి చేయాలని మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

మున్సిపల్ పరిధిలో పెండింగ్ ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో రెండు పడకగదుల ఇండ్ల పథకంలో భాగంగా నిర్మించిన భవనాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న నీటి ట్యాంకుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ పథకం ద్వారా ప్రతి ఇంటికి త్రాగునీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం మందమర్రి మండల కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి మున్సిపల్ కమిషనర్ రాజలింగుతో కలిసి అభివృద్ధి పనుల పురోగతి పారిశుధ్యం నర్సరీల నిర్వహణ త్రాగునీటి సరఫరా రెండు పడక గదుల ఇండ్ల పథకం నిర్వహణపై సమీక్షించారు. మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసే విధంగా సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ లకు భూమిపూజ చేసిన కాంగ్రెస్ నాయకులు



**మంథని,తెలంగాణ దిశ :**మంథని మండలంలోని విలోచవరం గ్రామానికి రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఎస్సీ సబ్ ప్లాన్ నుండి "5 లక్షల" రూపాయలనుసీసీ రోడ్డు మరియు సైడ్ డ్రైనేజీల కోసంసాంక్షన్ చేశారు. ఆ పనులను మంత్రి శ్రీధర్ బాబు సూచన మేరకు గ్రామంలోకాంగ్రెస్ నాయకులు కొబ్బరి కాయ కొట్టి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మంథని రాకేష్, మంథని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సాదుల శ్రీకాంత్ లు మాట్లాడుతూ గత పది సంవత్సరాలు పరిపాలించిన టిఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి మళ్లించి మన నియోజకవర్గాన్ని మరియు మన గ్రామాలని అభివృద్ధి జరగకుండా చూసిందని గుర్తు చేశారు.మన ప్రజారాజ్యం ఇందిరాగాంధీ రాజ్యం వచ్చాక రాష్ట్ర ఐటీ.ఈసీ, పరిశ్రమ ల మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుఎస్సీ సబ్ ప్లాన్ నిధుల ద్వారా మంథని నియోజకవర్గానికి 10 కోట్ల రూపాయలు తీసుకురావడం జరిగిందని అన్నారు.కేవలం అభివృద్ధి అంటేనే దుద్దిల కుటుంబంతోనే సాధ్యమని అభివృద్ధి అంటేనే శ్రీధర్ బాబు మరియు శ్రీను బాబు ద్వారానే అని అన్నారు.పేద ప్రజలకు ఏం అవసరమో చూసి వారికి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని అన్నారు.ఈ ప్రాంత, రాష్ట్ర అభివృద్ధి కోసం శ్రీధర్ బాబు నిత్యం సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మంథని రాజేశం, కోరవేన రవి, రోడ్డ రాజేశ్వరరావు, ప్రశాంత్ మరియు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# సందీప్ కుటుంబానికి అమెరికా నుంచి సహాయం



**కొత్తగూడ,తెలంగాణ దిశ :**సహాయం చేయాలనే మనసుంటే దూరం అడ్డంకి కాదని నిరూపించిన సంఘటన కొత్తగూడ మండలంలోని చోటు చేసుకుంది. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఏంపల్లి సందీప్ కుటుంబ పరిస్థితి గురించి తెలిసిన కొత్తగూడ ఫారెస్ట్ సెక్షన్ అధికారి రాజేష్, అమెరికాలో నివసిస్తున్న తన స్నేహితుడు హరికృష్ణకు విషయం వివరించారు.విషయం తెలిసిన వెంటనే హరికృష్ణ హృదయపూర్వకంగా స్పందించి. బాధిత కుటుంబానికి నావంతు సహాయంగా 50 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు లను ఫారెస్ట్ సెక్షన్ అధికారి రాజేష్ చేతుల మీదగా బాధిత కుటుంబానికి అందజేశారు.

ఆ సహాయం అందిన సందీప్ కుటుంబం కన్నీటి పర్యంతమై దూరం ఎంత ఉన్నా మనసుంటే సహాయం చేయొచ్చు అని చెప్పిన మాటను కార్యరూపం దాల్చిన హరికృష్ణ మానవత్వానికి ప్రతీకగా నిలిచారని సెక్షన్ అధికారి రాజేష్ ను, సహాయ దాత రామకృష్ణ కు గ్రామ పెద్దలు, స్థానికులు ధన్యవాదములు తెలుపుతూ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమం లో గ్రామ పెద్దలు కంగాల నాగేశ్వరావు, ఏంపల్లి నాగేశ్వరావు, జంగాల వినయ్, అజ్మీర్ తదితరులు పాల్గొన్నారు.

# జన వికాస సేవలు అభినందనీయం..

**సిఐ రామకృష్ణ గౌడ్, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్**

**జమ్మికుంట,తెలంగాణ దిశ :** జన వికాస సంస్థ ఆధ్వర్యంలో జమ్మికుంట పత్తి మార్కెట్ ఎదురుగా గల సంస్థ కార్యాలయ ఆవరణలో అనాధ వృద్ధులకు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జమ్మికుంట సిఐ రామకృష్ణ గౌడ్, జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్ లు మాట్లాడుతూ స్వంత పిల్లలే తల్లిదండ్రులను సరిగ్గా చూడని ఈ రోజుల్లో జనవికాస అనాధ వృద్ధుల ఆలన పాలన చూడడం అభినందనీయమని కొనియాడారు. బాలవికాస సెంటర్ ఫీల్డ్ కోఆర్డినేటర్ అమూల్య సంస్థ కార్యక్రమాలను వివరించారు. సంస్థ ఆధ్వర్యంలో 550 అనాధ వృద్ధులు ఉండగా జమ్మికుంట ఏరియా పరిధిలో 40 మంది ఉన్నారని వారికి సంవత్సరానికి ఒకసారి నిత్యవసర సరుకులు అందించడం జరుగుతుందని వివరించారు. దాతల సహాయ,సహకారాలతోనే ఈ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి విచ్చేసిన శ్రీమతి అనే మహిళ తన తల్లి జ్ఞాపకార్థం ఐదువేల రూపాయలను, ఆబాది జమ్మికుంటకు చెందిన అయాజ్ ఖాన్ తన కూతురు పుట్టిన రోజు సందర్భంగా పదివేల రూపాయలను విరాళంగా ఇచ్చారు. ద్రావిడ కళా మండలి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రముఖ వాగ్గేయ కారుడు రామంచ భరత్ తన తల్లి జ్ఞాపకార్థం ఐదువేల రూపాయలను విరాళంగా ఇచ్చారు. నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీమతి అనే మహిళ తన శక్తికి మించి 5 వేల రూపాయలు విరాళం ఇవ్వడం పట్ల మున్సిపల్ కమిషనర్ చలించిపోయారు. ప్రముఖ వెల్ నెస్ కోచ్, ఎంతోమంది మహిళలను ఆర్థికంగా ఎదిగేలా చేస్తున్న ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సత్యవతి, అంబాల లతా ప్రభాకర్ , ఉమా రాణి, రజిత జమ్మికుంట సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన, కోఆర్డినేటర్లు సుమలత, స్వాతి, ఆసియా తదితరులు పాల్గొన్నారు.

# చదువుతోనే మంచి భవిష్యత్తు కన్నెపల్లి : ఎస్ఐ భాస్కర్ రావు

**కన్నెపల్లి,తెలంగాణ దిశ :** విద్యార్థులకు చదువుతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని కన్నెపల్లి ఎస్ఐ భాస్కర్ రావు అన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులకు పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా కన్నెపల్లి పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పోలీస్ స్టేషన్ కు సంబంధించిన విధులు విద్యార్థులకు తెలియజేస్తూ పోలీస్ స్టేషన్లో ఉండే కమ్యూనికేషన్ సెట్, లాకప్ రూమ్స్ వారు ఉపయోగించిన ఇతర పరికరాల గురించి తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ జీవితంలో స్థిరపడాలంటే విద్యార్థి దశ నుండే మంచిగా చదువుకోవాలని, చదువులో ప్రతిభ ఫలితంగానీ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చు అని తెలిపారు. జీవితంలో స్థిరంగా ఉండాలంటే చదువే ముఖ్యమని అన్నారు.



# దేవుడిని చూద్దాం.. రండి



మనుషులుగా మనమందరం భగవంతుడి బిడ్డలం. దేవతల అనుగ్రహంతోనే మన జీవితాల్ని సార్థకం చేసుకునే ప్రయత్నం చేస్తుంటాం. ఈ క్రమంలో ఎవరి ఇష్టదైవాలు కొలువైన ఆలయాలకు వారు వెళ్లటం, అర్చనలు చేయించుకోవటం, దేవతలను ప్రార్థించటం సర్వసాధారణంగా జరుగుతుంది. కొలిచే దేవత ఎవరైనప్పటికీ ఆలయ సందర్శన మనందరి జీవితాల్లో ఓ భాగం. గుడికి వెళ్లటం ద్వారా మనకు మానసిక ప్రశాంతత లభిస్తుంది. కొండంత అండ మన చెంతనే ఉందన్న ధైర్యం కలుగుతుంది. ఇక అంతా మంచే జరుగుతుందన్న భరోసా లభిస్తుంది. ఇదంతా జరగటం వెనుక ఎన్నో ఆధ్యాత్మిక రహస్యాలు దాగున్నాయి.

ఆగమశాస్త్రాలతోపాటు పురాణాలు, శాస్త్రాలు సందర్భానుసారంగా ఆలయాలను సందర్శించుకునే విధానాన్ని, అనుసరించవలసిన నియమాలను పేర్కొంటున్నాయి. వీటన్నిటిని అవగాహన చేసుకోవాలి. మనం గుడికి వెళ్లకపోతే దేవుడు కోపిస్తాడని అనుకోవాల్సిన అవసరం లేదు. గుడికి వెళ్లకపోతే మంచి జరగదనో, శాపం తగులుతుందనే భయంతోనో ఆలయాన్ని సందర్శించాల్సిన పని లేదు. చెయ్యాల్సిం దంతా విధివిధానంగా, త్రికరణశుద్ధిగా చేసి మనం ఆలయానికి వెళ్లామా లేదా? స్వామిని దర్శించుకున్నామా లేదా? అని మాత్రమే ఆత్మపరిశీలన చేసుకోవాలి. అప్పుడు స్వామి తప్పకుండా మన గోడు వింటాడు. మనల్ని కరుణిస్తాడు. బాధలు తీరుస్తాడు. ఆలయానికి ఎందుకు వెళ్లాలి?: ఆలయానికి వెళ్లడమంటే దేవుడిని భౌతికనేత్రాలతో చూడటం, మొక్కులు చెల్లించుకోవటం, అర్చనలు చేయించుకోవటం, తీర్థప్రసాదాలు స్వీకరించటం, మనకు అంతా మంచే జరగాలని కోరుకోవటం%®% ఇవి మాత్రమే కాదు. ఇవన్నీ మనం పాటించే కొన్ని ఆచారాలు, సంప్రదాయాలు, విధివిధానాల్లో భాగం మాత్రమే. దైవదర్శనం కోసం మనం ఏర్పాటుచేసుకున్న వ్యవస్థలో ఇవన్నీ అంతర్లీనంగా సాగుతాయి. వీటన్నిటి వెనుకా దాగి ఉన్న పరమార్థాన్ని తెలుసుకుని దైవదర్శనం చేసుకోవాలి. అప్పుడే ఆలయానికి వెళ్లిన అసలైన పరమార్థం సిద్ధిస్తుంది. ఇదంతా జరగటం కోసమే ఆలయానికి వెళ్లాలే కానీ మన కోరికల చిట్టా భగవంతుడి ముందు విప్పటానికి కాదు. కష్టాలు చెప్పుకొని కోర్కెలు విన్నవించుకోవటానికి కానప్పుడు గుడికి ఎందుకు వెళ్లాలనే ప్రశ్న కలుగుతుంది.

భగవంతుడికి మన కష్టాలు చెప్పుకోకూడదా? మొక్కుకోవటం తప్పవుతుందా? అంటే%®% అవి ఎంతమాత్రం తప్పు కానే కాదు. కానీ, కేవలం మనకేదో మంచి జరిగితే నీకిది చేస్తానంటూ భగవంతుడితో బేరసారాలాడటం మాత్రం తప్పు. మనకు మంచి జరగాలని, అందుకు భగవంతుడి ఆశీస్సులు ఉండాలని తప్పనిసరిగా కోరుకోవాలి. మన ప్రారబ్ధకర్మల నుంచి విముక్తి కలిగించమని స్వామిని అనేకవిధాలుగా అర్థించాలి కూడా. అయితే ఇవి భక్తినివేదన తీరులో ఉండాలి. అంతేకానీ బేరసారాల మాదిరిగా నాకిదైతే నీకిది అన్నట్టుగా ఉండకూడదు.

ఆలయాలు అనంతమైన శక్తికి కేంద్రాలు. భక్తుడిని భగవంతుడి సన్నిధికి చేర్చే వారధిదేవాలయం. గుడి సందర్శన మనలో చైతన్యాన్ని నింపాలి. దైవికమైన భావనలు మనలో మరింతగా పెరగాలి. ధర్మబుద్ధి ద్విగుణీకృతం కావాలి. ఆలయ సందర్శన మనకు లౌకిక పరిధులు దాటి అలౌకికమైన ఆనందాన్ని కలుగజేయాలి. మనలో సానుకూల శక్తుల్ని మరింతగా వృద్ధి చెందించాలి. మనిషి మనీషిగా మారేందుకు బీజం పడాలి. ఇవన్నీ సాకారం కావటానికే ఆలయానికి వెళ్లాలి. స్వామిని దర్శించుకోవాలి. అభిషేకించాలి. అర్చించాలి. ఇదంతా జరగాలంటే ఆలయ సందర్శనలోని అసలైన ఆశయాన్ని గుర్తించాలి. అందుకు సంబంధించిన విధివిధానాలను పూర్తిగా పాటించాలి.

గుడికి వెళ్లేముందుగా: ఏదైనా గుడికి వెళ్లాలని అనుకున్నప్పుడు ముందుగా కొన్ని నియమాలను తప్పనిసరిగా పాటించాలి. ఆలయ సందర్శన హడావుడి వ్యవహారం కాకూడదు. ఇంట్లో వారు వెళు_న్నారు కాబట్టి మొహమాటానికి, ఇక తప్పదు అన్నట్టు వెళ్లకూడదు. ఆలయ సందర్శన కూడా ఓ యజ్ఞం. గుడికి వెళ్తున్నామంటే ఓ యజ్ఞాన్ని ప్రారంభిస్తున్నట్లే లెక్క. యజ్ఞదీక్ష తీసుకున్న వ్యక్తి ఎంతటి నియమనిష్ఠలతో ఉంటాడో ఆలయ సందర్శనకు సంకల్పించుకున్న వ్యక్తి అంతే నియమాలు పాటిస్తూ భక్తిశ్రద్ధలతో ఉండాలి. పరమపవిత్రమైన ఓ కార్యానికి పూనుకొన్న వ్యక్తి ఎంతటి సహృదయంతో, ఎటువంటి వికారాలు లేకుండా ఉంటాడో ఆలయానికి వెళ్లాలనుకున్న వ్యక్తి కూడా అదేవిధంగా ఉండాలి. అప్పుడే దేవాలయాన్ని సందర్శించుకున్న పరమార్థం సిద్ధిస్తుంది. భగవంతుడితో భక్తుడికి అనుబంధం ఏర్పడుతుంది. ఆధునిక పరిభాషలో చెప్పాలంటే ఆలయం ఓ అయస్కాంతక్షేత్రం. ఆ క్షేత్రంలోకి ప్రవేశించటానికి మనకు కొంత శక్తి అవసరమవుతుంది. ఈ శక్తి పాటించే నియమాల ద్వారా మనకు కలుగుతుంది. అయస్కాంతం ఇనుమును మాత్రమే ఆకర్షిస్తుంది. ఇనుము దృఢత్వానికి సంకేతం. భక్తుడు కూడా అంత దృఢమైన మనసుతో ఉండాలి. అప్పుడే భగవచ్ఛక్తి మనల్ని తనవైపు తిప్పుకొంటుంది.

తొలి సోపానం.. శుచిత్వం: ఆలయానికి వెళ్లాలని నిశ్చయించుకున్న వ్యక్తి పూర్తి శుచిగా ఉండాలి. శుచిత్వం అంటే ఆంతరంగికంగాను, బాహ్యంగానూ రెండు విధాలుగా శుభ్రంగా ఉండాలి. పరిశుభ్రమైన మనసు, శరీరం అద్భుతాలను చేస్తాయి. ఆ విషయాన్ని గుర్తించిన సనాతన భారతీయ సంప్రదాయం శుభ్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తూ వచ్చింది. అసూయ, ఆందోళన, అనుమానం, అసహనం, ఈర్ష్య, ద్వేషం, కోపం మొదలైన అవగుణాలు లేని మనసు ఎంతో స్వచ్ఛంగా, నిర్మలంగా ఉంటుంది. దీన్నే మానసిక శౌచం అంటారు. స్వచ్ఛమైన మనసుతో చేసే పూజ, ధ్యానం, తపం ఎంత చిన్నవైనా అనంతమైన ప్రభావాన్ని కలిగిస్తాయి. అందుకే యోగి వేమన 'చిత్తశుద్ధి లేని శివపూజలేలరా?' అంటారు. అలాగే మలినాలేవీ శరీరానికి అంటకుండా ఉండేలా స్నానాది విధులు చెయ్యటాన్ని బాహ్యశౌచం అంటారు. భౌతికమైన శుభ్రత మానసిక ఉన్నతికి పునాదిగా నిలుస్తుంది. శారీరకంగా, ఆంతరంగికంగా ఉండే పరిశుభ్రత మనిషికి ఏకాగ్రతను ఇస్తుంది. అతడిని లక్ష్యసాధన వైపు నడిపిస్తుంది.

అపవిత్రః పవిత్రోవా సర్వావస్థాం గతోపి వా
యస్మరేత్పుండరీకాక్షం సబాహ్యాభ్యంతరశ్శుచిః ?

నిత్యవిధుల్లో పూజా కార్యక్రమాలన్నీ ఈ శ్లోక పఠనంతోనే ప్రారంభమవుతాయి. భగవంతుడి అనుగ్రహం పొందాలంటే బాహ్య, అంతరంగ శౌచాలు తప్పనిసరి. పుండరీకాక్షుడి (విష్ణుమూర్తి) స్మరణం వల్ల శుచిత్వం వస్తుందని చెబుతుందీ శ్లోకం. బలం, ఆయుష్షు, ఆరోగ్యం, సంతోషం, ఆరోగ్యవంతమైన మనసు%®% ఇవన్నీ శుభ్రత వల్లనే లభిస్తాయని శాస్త్రాలు ఘంటాపథంగా చెబుతున్నాయి. శుభ్రత లేని చోట పరమాత్మ ఉండడు. స్నానం చేసి, పరిశుభ్రమైన వస్త్రాలు ధరించి ప్రార్థన, ధ్యానం లేదా ఆలయ సందర్శన ప్రారంభించాలి. ఇది ఆధ్యాత్మిక సాధనలో తొలిమెట్టు. శాస్త్రగ్రంథాలు కూడా 'శుచిత్వం మాతరూపేణ' అని చెబుతాయి. శుచిత్వం మనకు తల్లివంటిది. తల్లి ఏవిధంగా బిడ్డకు సదా రక్షగా ఉంటుందో, అదేవిధంగా శౌచం కూడా మనల్ని రక్షిస్తుందని భావం.


సంప్రదాయ వస్త్రధారణ: ఆలయానికి వెళ్లాలని నిశ్చయించుకున్న తర్వాత పాటించాల్సిన తొలి నియమం శిరస్నానం చెయ్యటం. దీని ద్వారా శారీరక శుభ్రత సాధించాలి. ఆ తర్వాత శుభ్రమైన పొడివస్త్రాలు మాత్రమే ధరించాలి. గతంలో ఉపయోగించి, ఉతక్కుండా పక్కనపెట్టిన వస్త్రాలు ధరించి ఆలయానికి వెళ్లకూడదు. స్త్రీ పురుషులిద్దరూ శక్తిని బట్టి అవకాశం ఉన్నంతవరకు పట్టువస్త్రాలు, లేదంటే శుభ్రమైన సంప్రదాయ వస్త్రాలు మాత్రమే ధరించాలి. ఇందులో ఎటువంటి మినహాయింపు లేదు.

సంప్రదాయ వస్త్రాలు ధరించటం అర్థం లేని నియమం కాదు. నేటితరం అర్థం చేసుకోలేనంత విజ్ఞానం అందులో ఉంది. సంప్రదాయ వస్త్రధారణ మన మనసును పట్టి ఉంచే కళ్లెంలాగా పనిచేస్తుంది. మనం ధరించే వస్త్రాలు, వాటి రంగు మన మనసు మీద తప్పనిసరిగా ప్రభావం చూపిస్తాయి. ఆధునికత పేరుతో చిత్రవిచిత్రంగా ఉండే వస్త్రాలు ధరిస్తే వాటి ప్రభావం మనసు మీద పడి, మన ప్రవర్తన కూడా విచిత్రంగా ఉంటుంది. మనసు దేనిమీదా స్థిరంగా లగ్నం కాదు. అంతిమంగా భగవంతుడి మీద కూడా మన దృష్టి నిలవదు. ఇటువంటి వస్త్రాలతో గుడికి వచ్చారంటూ చుట్టుపక్కల వారు మనల్ని అదోరకంగా చూస్తారు. ఇది కూడా మన బుద్ధిని ప్రభావితం చేస్తుంది. అధికమైన ధర పెట్టి కొన్న వస్త్రాలు మన పటాటోపాన్ని ప్రకటించి, అహంభావాన్ని పెంచుతాయి. మన ఆలోచనంతా మన వస్త్రాలు, అందమైన అలంకరణ చూసి ఇతరులు ఏమనుకుంటున్నారో అనే భావనతో నిండిపోతుంది. భగవంతుడి సన్నిధిలో ఎటువంటి అహంకార మమకారాలు, వికారాలు పనికిరావు. మన దర్పం, ఆడంబరం స్వామిని మనకు దూరం చేస్తాయి. సర్వసాధారణంగా సంప్రదాయ వస్త్రాలు తెలుపురంగులో ఉంటాయి. తెలుపు స్వచ్ఛతకు చిహ్నం. వస్త్రాలు ఎంత స్వచ్ఛంగా ఉన్నాయో మన మనసు కూడా అంతే స్వచ్ఛంగా ఉండాలన్న సందేశం ఇందులో దాగుంది. తెలుపురంగు మన బుద్ధిలో ఉండే ప్రకోపాల్ని నియంత్రిస్తుంది. నియంత్రిత బుద్ధి భగవంతుడి మీద మాత్రమే లగ్నమవుతుంది. తద్వారా భగవంతుడి అనుగ్రహానికి చేరువయ్యేందుకు మార్గం సుగమం అవుతుంది. వస్త్రాల తర్వాతి అంశం అలంకరణ. దేవాలయానికి వెళ్లేటప్పుడు విపరీతమైన అలంకరణ పనికిరాదు. మనం వెళ్లేది భగవంతుడి ముందు మోకరిల్లటానికే గానీ సౌందర్యాన్ని ప్రదర్శించటానికి కాదనే విషయాన్ని గుర్తించాలి. సంప్రదాయ వస్త్రాలు ధరించిన తర్వాత స్త్రీ పురుషులిద్దరూ తిలకధారణ తప్పనిసరిగా చెయ్యాలి. తిలకం లేని నొసటితో దైవదర్శనం చెయ్యకూడదు. సంప్రదాయ భేదాలను బట్టి తిలకం, విభూది, తిరునామం%®% ఏదైనా ధరించవచ్చు. తిలకం లేదా కుంకుమ ధారణ చెయ్యటానికి అర్హత లేనివారు విభూది / గంగసింధూరం ధరించాలి. ఏదోఒక తిలకం లేనిదే దైవదర్శనానికి అర్హత కలగదు.

ఆడంబర ప్రదర్శన వద్దు: కుటుంబసభ్యులు లేదా మిత్రులు, బంధువులతో కలిసి ఆలయానికి వెళ్లటం చాలా మంచిది. అయితే ఈ సందర్భంలో మనం ఆడంబరం ప్రదర్శించటం మాత్రం తగదు. ఇటీవలి కాలంలో ఆలయానికి వెళ్లటం కూడా మన హోదాను ప్రదర్శించే చిహ్నంగా మారింది. ఇది పూర్తిగా తగని పని. అత్యంత వినయంగా దైవదర్శన చేసుకోవాలి. స్వామి కోవెల ప్రాంగణంలో ప్రవేశించగానే ఆ స్వామి తప్ప మన వ్యక్తిగత స్థాయి మర్చిపోవాలి. మనసా, వాచా, కర్మణా దైవానికి మనల్ని మనం సమర్పించుకోవాలి. మనలోని అహంకారాన్ని అణచుకుని, స్వామికి శరణాగతి కావటమే దైవదర్శనం అంతరార్థం.

సమర్పణ భావమే ముఖ్యం: పూజాసామగ్రి ఏర్పాటులో ఎలాంటి లోపం చెయ్యకూడదు. అలాగని ఆర్భాటాలు చెయ్యాల్సిన పని కూడా లేదు. మన శక్తి లోపం లేకుండా దైవానికి ఏ వస్తువులు సమర్పించగలమో ఆ వస్తువులన్నిటినీ సిద్ధం చేసుకోవాలి. దైవానికి సమర్పణ చేస్తున్నామనే భావనతో పూజాద్రవ్యాలను ఏర్పాటుచేసుకోవాలి. అటువంటి ద్రవ్యాలతో చేసిన అర్చన మాత్రమే భగవంతుడికి ప్రీతిపాత్రమవుతుంది.

## అమృత ఫలం.. ఐస్ ఆపిల్!



తాటి ముంజలు.. ఎండకాలంలో మాత్రమే లభించే అమృత ఫలాలు. చూసేందుకు తెల్లని మంచు ముద్దలా నోట్లో వేసుకుంటే కరిగిపోయే వీటిని 'ఐస్ యాపిల్' అని పిలుస్తారు. ఎన్నో పోషకాలు, విటమిన్లతో నిండిన ఈ పండ్లు ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు అందిస్తాయి. తాటి ముంజల్లో యాంటి ఇన్‌ఫ్లమేటరీ,యాంటిబ్యాక్టీరియల్, యాంటి క్యాన్సర్, యాంటి డయాబెటిక్ లక్షణాలుఅధికం. ఇవి..వివిధ వ్యాధు లను దరిచేరనీయకుండా.. మన ఆరోగ్యానికి భరోసా కల్పిస్తాయి. తాటిముంజల్లో నీటి శాతం ఎక్కువ. కాబట్టి, వేసవిలో డీహైడ్రేషన్‌ను సమర్థంగా నివారిస్తాయి. వడదెబ్బకు గురైనవారికి తక్షణ ఉపశమనం అందిస్తాయి. శరీరానికి కావాల్సిన మినరల్స్, చక్కెర పదార్థాలను సమతుల్యం చేస్తాయి. శరీరాన్ని చల్లబరచడంతోపాటు రోగ నిరోధక శక్తిని పెంచడంలోనూ సహాయపడతాయి. ఇందులో అధికంగా లభించే ఫైబర్.. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. ఇక తక్కువ కేలరీలతో కూడిన తాటిముంజలు బరువు తగ్గడంలోనూ సాయపడతాయి. ముంజల్లో లభించే యాంటి ఆక్సిడెంట్లు.. చర్మ ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి. ఫైటోకెమికల్స్, ఆంథోసయనిన్ లాంటివి శరీరంలో వివిధ రకాల ట్యూమర్స్, బ్రెస్ట్ క్యాన్సర్ కణాలను అభివృద్ధి చేస్తాయి. వీటిని తాటి ముంజలు నిర్మూలిస్తాయని పలు పరిశోధనల్లో తేలింది. అందుకే, ఐస్ యాపిల్స్‌ను రెగ్యులర్‌గా తినేవారు.. వివిధ క్యాన్సర్ల బారిన పడకుండా ఉంటారని పరిశోధకులు చెబుతున్నారు. ఇక ఇందులోని పొటాషియం.. కాలేయ సంబంధ వ్యాధులను తగ్గిస్తుంది. ఇక చాలామంది గర్భిణులు మలబద్ధకం, అసిడిటీ సమస్యతో బాధపడుతుంటారు. అలాంటివాళ్లు తాటిముంజలను తీసుకుంటే.. వారి జీర్ణవ్యవస్థ చురుగ్గా పనిచేస్తుంది. అసిడిటీ, మలబద్ధకం తగ్గుముఖం పడతాయి. ఎండల్లో తిరగడం వల్ల ముఖంపై వచ్చే చిన్నచిన్న మొటిమల్లాంటి పొక్కులను తాటి ముంజలు సమర్థంగా అడ్డుకుంటాయి. అయితే, కొందరు ముంజలపై గోధుమ రంగులో ఉండే పొట్టును తీసేసి.. కేవలం తెల్లటి పదార్థాన్ని మాత్రమే తింటారు.

## ఈ పొరబాట్లు చేయకండి..



చాలా మందికి టీ అనేది కేవలం ఒక పానీయం కాదు, ఒక అనుభూతి. రోజూ ఎంతో ఆసక్తిగా తాగే ఈ టీలో చేసే కొన్ని సాధారణ తప్పులు మన ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతాయి. టీని సరిగ్గా తాగకపోవడం శరీరానికి హానికరం. టీని తరచుగా తాగడం వల్ల, ఖాళీ కడుపుతో తాగడం వల్ల, లేదా ఎక్కువ టీ ఆకులను జోడించడం వల్ల టీ తాగే అలవాటు క్రమంగా శరీరానికి హాని కలిగిస్తుంది. టీ తాగేటప్పుడు ఈ తప్పులు అసలు చేయొద్దని నిపుణులు చెబుతున్నారు.

ఖాళీ కడుపుతో టీ తాగడం : కొంతమంది ఉదయం నిద్రలేచిన వెంటనే టీ తాగుతారు.. ఇది హానికరం. ఖాళీ కడుపుతో టీ తాగడం వల్ల అసిడిటీ సమస్యలు వస్తాయి. ఇది గ్యాస్, బర్నింగ్ సెన్సేషన్, మలబద్ధకం వంటి సమస్యలను కలిగిస్తుంది. కనుక టీ తాగే ముందు గోరువెచ్చని నీరు తాగాలి.

ఎక్కువ సార్లు : టీ ప్రియులు రోజుకు 4, 5 సార్లు లేదా అంతకంటే ఎక్కువ సార్లు టీ తాగుతారు. ఇలా చేయడం వల్ల శరీరంలో కెఫిన్ పరిమాణం పెరుగు తుంది. దీని వలన నిద్ర లేకపోవడం, భయం, అలసట కలుగుతుంది. అందువల్ల రోజుకు 2 కప్పుల కంటే ఎక్కువ తాగకూడదు. రాత్రి కూడా ఆలస్యంగా టీ తాగకూడదు.

ఘాటైన రుచి : ఘాటైన లేదా బాగా మరిగించిన టీని కొంతమంది ఇష్టపడతారు. ఇలా చేయడం వల్ల టానిన్, కెఫిన్ స్థాయిలు పెరుగుతాయి. ఇవి జీర్ణవ్యవస్థను ప్రభావితం చేస్తాయి. కాబట్టి టీని ఎక్కువగా మరిగించి.. చాలా చిక్కగా చేయకూడదు.

భోజనం తిన్న వెంటనే : భోజనం చేసిన వెంటనే కొంతమందికి టీ తాగే అలవాటు ఉంటుంది. ఇది ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదు. భోజనం చేసిన వెంటనే టీ తాగడం వల్ల ఆహారంలో ఉండే ఐరెన్, పోషకాల శోషణ తగ్గుతుంది. టీ తాగాలనుకుంటే భోజనం చేసిన తర్వాత 30-45 నిమిషాల తర్వాత మాత్రమే తాగాలి.

తీపి టీ : ఎక్కువ చక్కెర జోడించిన తీపి టీ కొంతమంది ఇష్టపడతారు. దీంతో టీలో అవసరమైన దానికంటే ఎక్కువ చక్కెరను కలుపుకుంటారు. అయితే అతిగా తీపి టీ తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి, ఊబకాయం, మధుమేహం సమస్యలు వస్తాయి. వీలైతే టీలో చక్కెరను తగ్గించాలి లేదా బెల్లంని ఉపయోగించాలి.

## నోటి దుర్వాసనకు గ్లిజరిన్‌తో చెక్



కన్నీళ్లు కార్చడం కోసం నటులు గ్లిజరిన్ ఉపయోగిస్తారని తెలిసిందే. అదే గ్లిజరిన్ నవ్వులు కూడా తెప్పిస్తుందని తెలుసా? చాలామంది నవ్వలేక ఏడుస్తారు. నవ్వితే నోటి దుర్వాసనతో ఎదుటివాళ్లు ఏమనుకుంటారోనని నవ్వలేరు. నవ్వు ఆపుకోలేక నవ్వితే ఎదుటివాళ్లు నవ్వారని ఏడుస్తారు. ఇలాంటి సంకట స్థితిలో ఆ దుర్వాసనకు విరుగుడు గ్లిజరిన్. నోటి దుర్వాసనతో దీర్ఘకాలంగా బాధపడుతున్న వారికే కాదు వెల్లుల్లి, ఉల్లి తిన్నతర్వాత కూడా నోటి దుర్వాసన వస్తుంది. %ఈ రెండు రకాల దుర్వాసనలకు గ్లిజరిన్ చెక్ పెట్టేస్తుంది. గోరువెచ్చని నీటిలో గ్లిజరిన్ (గ్లిజరాల్) కలిపి కాసేపు పుక్కిలిస్తే దుర్వాసన మాయమైపోతుందట. ఉల్లి, వెల్లుల్లిలో గంధకం (సల్ఫర్) సమ్మేళనాలు ఉంటాయి. ఈ సమ్మేళనాలు అమైనో ఆమ్లాలు, ఇతర ఆమ్లాలుగా మారతాయి. నోటి దుర్వాసన రావడానికి కారణం ఇవే. గ్లిజరిన్‌తో నోటిని తడపడం వల్ల నోట్లో బ్యాక్టీరియా పెరుగుదల ఆగిపోతుంది. చిగుళ్ల ఆరోగ్యం మెరుగవుతుంది. చిగుళ్ల సమస్యలు, నోటి దుర్వాసన ఉంటే గ్లిజరిన్‌తో చేసిన మౌత్‌వాష్‌లు, టూత్‌పేస్టులు కూడా మార్కెట్లో ఉన్నాయి. అయితే, నోటి దుర్వాసన పోగొట్టే ప్రయత్నంలో గ్లిజరిన్ గొంతులోకి పోకుండా చూసుకోవాలి. లేదంటే వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, గొంతులో మంట వంటి సమస్యలు వస్తాయి.

## ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా



ర్షాల్లో తేమ, నీటి కాలుష్యం వల్ల బ్యాక్టీరియా, కీటకాలు తయారవుతా యి. దీంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. దగ్గు, జలుబు, ఫ్లూ వంటి వైరల్ ఇన్‌ఫెక్షన్లు కూడా తలెత్తుతాయి. వీటి బారిన పడకుండా ఇంట్లోనే చిన్న చిట్కాలతో బయటపడవచ్చు. అవేంటో చూద్దాం. తులసి : తులసిలో యాంటీ బాక్టీరియల్, యాంటీవైరల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఉంటాయి. ఇది ఇన్ఫెక్షన్ల నుండి కాపాడుతుంది. తులసి ఆకులను తినడం కానీ.. తులసి టీని తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అంతేకాకుండా శ్వాసకోశ సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు. ఇంకా ఒత్తిడి స్థాయిలను తగ్గిస్తుంది. అల్లం : అల్లంలో ఉండే యాంటీ ఇన్‌ప్లేమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి జలుబు, దగ్గు, గొంతు నొప్పి నుండి ఉపశమనాన్ని అందిస్తాయి. అల్లం టీ తీసుకోవడం లేదా ఆహారంలో అల్లం భాగం చేసుకోవడం వల్ల జీర్ణశక్తి పెరుగుతుంది. వెల్లుల్లి : వెల్లుల్లిలో యాంటీమైక్రోబ యల్, రోగనిరోధక శక్తిని పెంచే అల్లిసిన్లో సమృద్ధిగా ఉంటుంది. పచ్చి వెల్లుల్లిని తీసుకోవడం వంటలో భాగం చేసుకోవడం వల్ల ఇన్ఫెక్షన్‌లను నివారించవచ్చు. వెల్లుల్లితో కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించవచ్చు. దీంతో గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. వేప : వేపలో యాంటీమైక్రోబయల్, యాంటీవైరల్ లక్షణాలు ఉంటాయి. వేప ఆకులు లేదా వేప ఆధారిత ఉత్పత్తులను తీసుకోవడం వల్ల రక్తాన్ని శుద్ధి చేస్తుంది. అలాగే మలేరియా, డెంగ్యూ, ఫ్లూ వంటి వైరల్ ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా ఉండవచ్చు.

# పాపం.. మాధవీలత..



**హైదరాబాద్,తెలంగాణ దిశ :**గత ఏడాది జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో ప్రధానంగా మీడియాలో హైదరాబాద్ నుంచి పోటీ చేసిన మాధవి లత గురించి చర్చ జరిగింది. హైదరాబాద్ సిట్టింగ్ ఎంపీ ఓవైసీ మీద ఆమె పోటీ చేశారు. బిజెపి అభ్యర్థిగా వినూత్నమైన విధానంలో ప్రచారం చేశారు. పైగా మాధవి లతకు సొంతంగా ఒక ఆసుపత్రి కూడా ఉంది. సమాజంలో పలుకుబడి కూడా విపరీతంగా ఉంది. అటువంటి మహిళను హైదరాబాద్ ఓటర్లు గెలిపించుకుంటారని అందరూ అనుకున్నారు. స్వయంగా హోంశాఖ మంత్రి అమిత్ షాను కూడా మాధవి లత గురించి ప్రస్తావించారు. వాస్తవానికి ఎన్నికల్లో ఫలితం బిజెపికి అనుకూలంగా వస్తుందనుకుంటే.. మాధవి లత ఊహించని విధంగా హైదరాబాద్ ఓటర్లు తీర్పు ఇచ్చారు. దీంతో ఆమె ఒక్కసారిగా షాక్ అయ్యారు.ఓటమి తర్వాత కొంతకాలం పాటు ఆమె పెద్దగా కనిపించలేదు. ఇటీవల కాలంలో తన ఆసుపత్రిలో తగ్గించిన ఫీజుల గురించి ఆమె ఒక వీడియోలో మాట్లాడారు. ఇప్పుడు జూబ్లీహిల్స్ శాసనసభకు ఉప ఎన్నికలు వచ్చిన నేపథ్యంలో బిజెపి అభ్యర్థి దీపక్ రెడ్డి తరఫున ఆమె ప్రచారం చేస్తున్నారు. ఓటర్లను వెళ్లి నేరుగా కలుస్తున్నారు. ఈ క్రమంలో బిజెపికి ఓటు వేయాలని.. హైదరాబాద్ నగర రూపురేఖలు బిజెపి ద్వారానే మారుతాయి అని ఓటర్లను కోరుతున్నారు. ఆమె రాజకీయ నాయకురాలు కాబట్టి.. పైగా బీజేపీలో ఉన్నారు కాబట్టి ఎన్నికల్లో అలా ప్రచారం చేయడం సర్వసాధారణం. అయితే మాధవి లత సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటారు. మీడియాలో కూడా ప్రముఖంగా కనిపిస్తారు కాబట్టి.. ఆమె గురించి సహజంగానే ప్రజల్లో ఆసక్తి ఉంటుంది. పైగా స్వయంగా ఆమె ప్రచారం చేస్తున్న నేపథ్యంలో ప్రజలు ఆమెతో మాట్లాడేందుకు ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఆమెను కొంతమంది ఓటర్లు టార్గెట్ చేయడమే ఇక్కడ అసలైన విషాదం.మాధవి లత ప్రచారానికి వెళ్తున్న సమయంలో జూబ్లీహిల్స్ ఓటర్లు ఆమెను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. మోడీ మా ఖాతాలో డబ్బులు వేస్తానని చెప్పారని.. కానీ ఇంతవరకు వేయలేదని ఓటర్లు ఆమెను ప్రశ్నిస్తే.. వివిధ పథకాల ద్వారా మీ ఖాతాలలో డబ్బులు జమ అవుతున్నాయి కదా అని మాధవి లత సమాధానం చెప్పారు. అయితే ఆ పథకాలు తమదాకా రావడంలేదని ఓటర్లు అన్నారు. క్రితం ఎన్నికల్లో మీకే ఓటు వేశామని మెజారిటీ ఓటర్లు మాధవి లతతో చెప్పారు. దానికి ఆమె ఏ గుర్తుకు ఓటు వేశారని అడిగితే.. కారు గుర్తు అని చెప్పారు. కారు గుర్తు తమది కాదని.. తమది కమలం అని చెబితే.. ఏ గుర్తుకు ఓటు వేసినా పెద్దగా ప్రయోజనం లేదని ఓటర్లు పెదవి విరిచారు. కేటీఆర్, రేవంత్ రెడ్డి అభివృద్ధి చేశారని.. మీరు ఏం చేస్తారో చెబితే ఓటు వేస్తామని ప్రజలు మాధవి లతను ప్రశ్నించారు. దానికి ఆమె ఆలోచించుకుని చెబుతామని అన్నారు. అలాంటప్పుడు మీరు మా వద్దకు ఎందుకు వచ్చారని కొంతమంది ఓటర్లు ప్రశ్నించారు. దీంతో ఆమె వారి ప్రశ్నలకు సమాధానం చెప్పలేక.. వేగంగా వచ్చేశారు.

# ముఖ్యమంత్రికి... పదవీ గండం..?



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైకాంగ్రెస్ హైకమాండ్ ఆగ్రహంగా ఉందన్న ప్రచారం ఊపందుకుంది. కొన్ని మీడియాలు ఇటువంటి కథనాలు ప్రచురిస్తున్నాయి. కానీ కాంగ్రెస్ వర్గాలు మాత్రం ఆ ప్రచారాన్ని కొట్టిపారేస్తున్నాయి. రేవంత్ రెడ్డి అంటే గిట్టని కొందరు పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నారని బాహాటంగానే చెబుతున్నారు. మల్లికార్జున ఖర్గే తనను పరామర్శించడానికి వెళ్లిన కాంగ్రెస్ నేతలతో ఈ వ్యాఖ్యలు చేసినట్లు కథనాలు వచ్చాయి. అయితే ఏఐసీసీ అధ్యక్షుడిగా ఇటువంటి వ్యాఖ్యలు పార్టీ నేతలు ముందు మల్లికార్జున ఖర్గే చేస్తారా? అన్న అనుమానం లేకపోలేదు. ఎందుకంటే జాతీయ అధ్యక్షుడి హోదాలో ఉంటూ నేతలతో ముఖ్య మంత్రి పనితీరును తప్పుపట్టే విధంగా మాట్లాడటం అసాధ్యమన్నది రేవంత్ రెడ్డి వర్గీయుల వాదననిజానికి రేవంత్ రెడ్డిపై పార్టీ హైకమాం డ్‌కు నిజంగా అసంతృప్తి ఉంటే ఆయనను ఏదో ఒక వంకతో పదవి నుంచి తప్పించే వారు. అంతేతప్ప కాంగ్రెస్ నేతలతోఆయన పనితీరు ను తప్పుపట్టే పనిని ఏ పార్టీ నాయకత్వం చేయదన్నది వాస్తవం. నిజానికి తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ ఇచ్చినప్పుడు కూడా రెండు సార్లు అధికారంలోకి రాలేదు. 2014 లో కాంగ్రెస్ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చినప్పటికీ 2014, 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవలేకపోయింది. నిజంగా ప్రజలకు కేసీఆర్ పై గురి కుదిరి ఉంటే 2014 ఎన్నికల్లో విజయంతో సరిపెట్టేవారు. రెండోసారి కూడా ఆయనకే పట్టం కట్టారం టే కాంగ్రెస్ నేతల పట్ల సరైన నమ్మకం లేకపోవడమే. అంతేకాకుండా కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం ప్రజలను కూడా ఆ రెండు ఎన్నికల్లో ఆకట్టులేకపోయిందని రేవంత్ వర్గీయులు అంటున్నారు. 2023 ఎన్నికలకు ముందు పీసీసీ చీఫ్ పదవి దక్కించుకున్న తర్వాత రేవంత్ రెడ్డి జనంలోకి వెళ్లడమే కాకుండా పార్టీని గెలుపు దిశగా తీసుకు వచ్చారంటున్నారు. కేసీఆర్ మాటలకు ధీటుగా రేవంత్ రెడ్డి ప్రసంగం కూడా ప్రజలను ఆకట్టుకోవడం గత ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఒక కారణమన్న విశ్లేషణలు కూడా ఉన్నాయి. దీంతో పాటు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు కూడా బాగా పనిచేయడం వల్లనే కాంగ్రెస్ గెలుపు సాధ్యమయింది. ఈ పరిస్థితుల్లో రేవంత్ రెడ్డి ని తప్పించి మరొకరిని ముఖ్యమంత్రి పదవిలో కూర్చోబెట్టే సాహసం కాంగ్రెస్ హైకమాండ్ చేసే అవకాశం లేదు. నిధులు లేకపోయినా ఇచ్చిన హామీలను అమలు చేశారని, మొత్తం మీద తప్పుడు ప్రచారం చేయవద్దంటూ రేవంత్ రెడ్డి వర్గీయులు సోషల్ మీడియాలో వార్నింగ్ ఇస్తున్నారు.


## సుంపుటంలో గుడుంబా, మద్యపానం నిషేధం



**వేమనపల్లి,తెలంగాణ దిశ :** మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం సుంపుటం గ్రామంలో ఈరోజు నుండి మద్యపానం, గుడుంబా పూర్తిగా నిషేధిస్తున్నట్లు స్వచ్ఛందంగా గ్రామ ప్రజలందరూ ఏకగ్రీవంగా గ్రామ వేదిక తీర్మానం చేసి ప్రతిజ్ఞ చేశారు. వారు మాట్లాడుతూ.. మా గ్రామంలో ఇకపైన గుడుంబా, మద్యపానం ఎవరైనా అమ్మిన, తయారు చేసిన, గ్రామంలో ఎవరైనా తాగిన గ్రామ వేదిక తీర్మానం మేరకు ఈ నిబంధన ఉల్లంఘించిన వారికి యాభై వేల రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు గుడుంబా, మద్యపానం నిషేధిత గ్రామంగా మేము ప్రకటించుకుంటున్నాం. మీరు సహకరించాలని గ్రామస్తులంతా ఏకమై గ్రామంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని లక్ష్యంతో పురుషులు, మహిళలు, యువత గ్రామ ప్రజలు సమిష్టి నిర్ణయం తీసుకొని గ్రామస్తుల అందరికి సమక్షంలో ప్రతిజ్ఞ చేశామని గ్రామంలో ఎవరైనా గుడుంబా, బెల్టు షాపులు వారు మద్యం తీసుకువచ్చి అమ్మిన, రవాణా చేసే వ్యక్తులను గ్రామస్తులంతా ఏకమై స్వచ్ఛందంగా వారిని పట్టుకొని పోలీస్ శాఖకు అప్పగిస్తామని తమ గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉండి ఆర్థికంగా ఎదగాలని స్వచ్ఛందంగా గ్రామ వేదిక ద్వారా తీర్మానం చేసుకున్నామని అక్కడి ప్రజలు పిలుపునిచ్చారు.

## రహదారుల ఎఫెక్ట్..

## స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్తామంటున్న ప్రజలు



**మంచాల,తెలంగాణ దిశ :** గ్రామీణ ప్రాంత రహదారులను అభివృద్ధి చేసి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచాలనే ప్రభుత్వ లక్ష్యం క్షేత్రస్థాయిలో నెరవేరడం లేదు. మంచాల మండలంలోని వివిధ గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రయాణం నరకంగా మారింది. మండలంలోని 23 గ్రామపంచాయతీలకు సగం గ్రామపం చాయతీలలో ఒక్క రోడ్డు కూడా సరిగా లేకపోవడంతో రోడ్ల మీద ప్రయాణం చేయాలంటేనే చేయలేని పరిస్థితి ఎదురవుతోంది. ఒక్కోసారి పెద్ద వాహనాలు వచ్చినప్పుడు టైరు ఎక్కినప్పుడు కంకర రాళ్లు లేచి వాహనాదారులకు తగిలి గాయాలపాలవుతున్నారు. ఆరుట్ల నుండి చెన్నారెడ్డి గూడ అక్కడి నుండి బోడకొం డ, మంచాల నుండి జాపాల, తాళ్లపల్లిగూడ నుండి చిత్తాపూర్, తిప్పయిగూడతో పాటు మండలంలోని అనేక గ్రామాల్లో ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఘోరమైన పరిస్థితి నెలకొంది వివిధ గ్రామాలనుంచి మండల కేంద్రానికి వెళ్లాలన్నా వెళ్లలేని పరిస్థితి ఎదురవుతోంది. ఎవరు ఎమ్మెల్యేగా చేసిన మండలంలో అభివృద్ధికి చోటు లేకుండా పోయింది అని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రతీసారి ఎన్నికలో వచ్చి నాయకులు వాగ్దానాలు చేసి వెళ్తారు.. మీ మండలం చాలా వెనకబడింది అని. చెప్పి చెప్పి ఇంకా వెనక్కి చేస్తున్నారు అని ఆరోపిస్తున్నారు. స్థానిక ఎన్నికల కోసం వెచ్చి చూస్తున్నాం అని అంటున్నారు. ఈ సారి ఎవరు వచ్చిన తమ దగ్గర ఎవరి పప్పులు ఉడుకవు అని చెప్తున్నారు.అధికారులకు అయితే తమ సమస్యలు చెప్పి విరక్తి వస్తుంది అని, చెప్పిన ఏం స్పందన లేదు అని అంటున్నారు.

# బయిటకు రా... కేడర్ లో ఒక్కటే డిమాండ్



**విజయవాడ,తెలంగాణ దిశ :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఎక్కువ సమయం బెంగళూరులోనే ఉంటున్నారు. ఇప్పటికే 2024 ఎన్నికల్లో ఓటమి పాలయి దాదాపు రెండేళ్లకు దగ్గరపడుతుంది. ఇప్పటికైనా బెంగళూరు వదిలి తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో నేతలకు, ముఖ్యమైన కార్యకర్తలకు అందుబాటులో ఉండాలన్న డిమాండ్ ఎక్కువగా వినపడుతుంది. నెలలో ఇరవై నాలుగు రోజులు బెంగళూరులోనే జగన్ ఉంటున్నారు. కేవలం ఆరు రోజులు మాత్రమే తాడేపల్లికి వస్తున్నారు. అదీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకో.. నేతలతో సమావేశమవ్వడానికో ఆయన వస్తున్నారు. కానీ ఇకపై లాభం లేదని, ఇప్పటికే సమయం మించి పోయిందని, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదవుతున్నాయని, నేతలు కూడా బయటకు ఇంకా రావడం లేదని, దీనికి ప్రధాన కారణం జగన్ ఇక్కడ ఉండకపోవడమేనన్న అభిప్రాయం కార్యకర్తల్లో బలంగా కనిపిస్తుంది.. కానీ రాయలసీమలో అతి తక్కువ సార్లు మాత్రమే జగన్ పర్యటించారు. నిజానికి ఓటు బ్యాంకు, వైసీపీకి పట్టున్న రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు. రాయలసీమలో వైసీపీ నేతల మధ్య సఖ్యత కొరవడింది. ఇప్పటి నుంచే సీట్ల కోసం కొందరు ప్రయత్నిస్తున్నారు. మరికొందరు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. పటిష్టమైన క్యాడర్ ఉన్న రాయలసీమను అలా వదిలేస్తే రానున్న కాలంలో ఎలా అన్న ప్రశ్న వినపడుతుంది. జగన్ మాత్రం ఇంకా టైముందని చెబుతున్నారు. కానీ అప్పటికి నష్టం తీవ్రత మరింత పెరిగే అవకాశముందన్న ఆందోళన పార్టీ నేతల్లో కనిపిస్తుంది. క్షేత్ర స్థాయిలో నాయకత్వం... నిజానికి ఇప్పటి వరకూ పార్టీకి క్షేత్రస్థాయిలో సరైన నాయకత్వం లేదన్నది వాస్తవం. నియోజకవర్గాల్లో బూత్ లెవెల్ కమిటీలను నియమించాలని కొద్దిరోజుల క్రితం జగన్ నేతలను ఆదేశించినప్పటికీ అవి కార్యరూపం దాల్చలేదు. చాలా నియోజకవర్గ ఇన్ ఛార్జుల విషయంలోనూ ఇంకా జగన్ నుంచి క్లారిటీ లేదు. గత ఎన్నికల్లో నియోజకవర్గాలను మార్చారు. అయితే అక్కడ గత ఎన్నికల్లో పోటీ చేసిన నేతలు వెళ్లడం లేదు. మరొకవైపు జోగి రమేష్ వంటి నేతలు తాము మైలవరంలో వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించుకుంటున్నారు. ఇలాంటి సమయంలో జగన్ బయటకు వస్తేనే తప్ప ఈ సమస్యలకు తెరపడదు. కానీ ఆయన బెంగళూరు వదిలి రాకపోవడంతో క్యాడర్ కు అదే బెంగ పట్టుకుందంటున్నారు.

## కేరళలో ఇన్‌స్టంట్ ఆన్‌లైన్ మ్యారేజ్ రిజిస్ట్రేషన్

**తిరువనంతపురం,తెలంగాణ దిశ :** కేరళలో వివాహాల రిజిస్ట్రేషన్లు డిజిటల్ బాట పడుతున్నాయి. నవ దంపతులు స్థానిక సంస్థల కార్యాలయాలకు వెళ్లవలసిన అవసరం లేకుండా, ఆన్‌లైన్‌లోనే వివాహ రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. వధూవరులు ఆధార్ ఆధారిత ఓటీపీ లేదా ఈ–మెయిల్ అథెంటికేషన్ ద్వారా తమ గుర్తింపు తనిఖీలను పూర్తి చేసుకోవచ్చు. తనిఖీ పూర్తయిన తర్వాత వెంటనే డిజిటల్లీ డౌన్‌లోడబుల్ సర్టిఫికేట్లు వస్తాయి. ఈ ధోరణి కేరళలో ఊపం దుకుంటున్నది. 2024 జనవరి నుంచి 2025 సెప్టెంబరు మధ్య కాలంలో 1,44,416 వివాహాలు నమోదు కాగా, వీటిలో 62,524వివాహాల రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్‌లోనే జరిగింది. తాజాగా లావణ్య, విష్ణు దంపతులు వీడియో కేవైసీ ద్వారా కవస్సెరీలోని పంచాయతీ కార్యాలయంలో తమ వివాహాన్ని రిజిస్టర్ చేయించుకు న్నారు. వీరు ఆన్‌లైన్‌లోనే తమ వివాహ రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేసుకున్నారు. దంపతుల ఫొటోలతో వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ అదే రోజు వచ్చింది. వీరిద్దరూ నవ్వుతూ, ఆన్‌లైన్‌లో తమ కేవైసీ వివరాలను వెరిఫై చేయించుకుంటున్న వీడియో సామాజిక మాధ్య మాల్లో వైరల్ అవుతున్నది. ఉదాహరణగా నిలిచిందని నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు.



# కిస్సా... కుర్సీకా

**అదిలాబాద్,తెలంగాణ దిశ :** నిర్మ ల్ జిల్లాలో చేతి పగ్గాలను చేజిక్కించుకునేందుకు ఎవరికి వారే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీల ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటుంది. ఈనెల 25 లోపు తెలంగాణ రాష్ట్రం లోని అన్ని జిల్లాల్లో డిసిసి అధ్యక్షులు నియామకానికి క్షేత్రస్థాయిలో కసరత్తు పూర్తి కావ డంతో ఎంపికపై ఆసక్తి నెలకొంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రాజకీయ చైతన్య ఉన్న నిర్మల్ జిల్లాలో అధ్యక్ష పదవికి పెద్ద ఎత్తున దరఖాస్తులు రావడం అందులో సీనియర్ నేతల ఉండడంతో ఎవరిని ఎంపిక చేస్తారన్న అంశంపై జిల్లా కాంగ్రెస్లో
తీవ్రంగా చర్చ జరుగుతుంది.ప్రస్తుతం నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జ్ కే శ్రీహరిరావు డిసిసి అధ్యక్షు నిగా రెండు సంవత్సరాలుగా కొనసాగుతున్నారు. 2023 డిసెంబర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు డిసిసి అధ్యక్ష పదవి చేపట్టిన శ్రీహరి రావు కాంగ్రెస్ జిల్లా బాధితు లను కూడా నిర్వర్తిస్తూ వస్తున్నారు.

కర్ణాటక చెందిన మాజీ మంత్రి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అజయ్‌సింగ్ నిర్మల్ ఖానాపూర్ ముధోల్ నియోజకవర్గం బ్లాక్ స్థాయి సమావేశాలు నిర్వహించి బీసీసీ అధ్యక్షుని ఎంపికపై అభిప్రాయ సేకరణ నిర్వహించారుఅఖిలభారత కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షులు ఎంపిక విషయంలో ఈసారి పారదర్శకత పద్ధతిలో ఎంపికకు శ్రీకారం చుట్టింది. రాజకీయ ప్రాబల్యం ఉన్న నేతలకు కాకుండా ప్రజలతో సంబంధాలు ఉండి పార్టీ కార్యక్రమాలు నిర్వహించి ఈ నాయకుడిని అయినా డీసీసీ అధ్యక్షులు ఎంపిక చేసుకోవచ్చని సూచించింది. నిర్మల్ జిల్లాలో డిసిసి అధ్యక్ష పదవి కోసం మొత్తం 20 మంది దరఖాస్తు చేసుకున్నారు. డిసిసి అధ్యక్షులు శ్రీహరి రావుతో పాటు సీనియర్ నాయకులైన పత్తిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, అల్లూరి కృష్ణావేని, దశరథం రాజేశ్వర్, గ్రంథాలయ చైర్మన్ అర్జున్ మత్ అలీ, అనుముల భాస్కర్, ముడుసు సత్యనారాయణ, గంగారెడ్డి, ఆనందరావు పటేల్, రాజుర సత్యం తదితర సీనియర్ నాయకులతో పాటు జూనియర్ నాయకులు కూడా ఉన్నారు. డిసిసి అధ్యక్షులు ఎన్నికలు పేర్ల కసరత్తు పూర్తి అయి ముగ్గురు పేర్లను ఢిల్లీకి పంపినట్టు ప్రచారం జరుగుతుంది ఇందులో అయితే డిసిసి డిసిసి అధ్యక్షులు శ్రీహరి రావు, గ్రంథాలయ చైర్మన్ అర్జుమత్ అలీ, సీనియర్ నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి పేర్లు ఉన్నట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీలో ఐదు సంవత్సరాలుగా పనిచేసే ఉం డాలని ఒకరికి ఒక పదవి ఇవ్వాలని ప్రజల అభిప్రాయం మీదకి ఎంపిక బాధితులు చేపట్టాలని రాజకీయ లాబింగ్లకు దూరంగా ఉంటూ జిల్లాలో సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకొని ఎంపిక చేయాలని రాష్ట్ర పరిశీలకులను ఆదేశించింది దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 15 మందిపైగా 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరిన వారి అధికంగా ఉన్నారు.ఇందులో కాంగ్రెస్ పార్టీలో గ్రంథాలయ చైర్మన్ అర్జుమాత్ అలీ బ్లాక్ కాంగ్రెస్ నాయకులు దశరథం రాజేశ్వర్ బైంసాకు చెందిన మాజీ మార్కె ట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పార్టీలతో పాటు మరో నలుగురు ఉంటారని పార్టీ నేత లు చెప్తున్నారు. అయితే జిల్లాలో రాజకీయ చైతన్యం అందర్నీ కలుపుకుపోయే నేతలు ప్రజలతో ఉన్న సంబంధాలను దృష్టిలో పెట్టుకొని డిసిసి అధ్యక్షుని ఎంపిక నిర్వహించే విధంగా కసరత్తు జరుగుతుంది. డిసిసి అధ్యక్షుని ఎంపికకు తన పేరు కూడా పరిశీలించాలని రాష్ట్ర కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురా లు కృష్ణవేణి కూడా దరఖాస్తు చేసుకున్నారు. నిర్మల్ జిల్లాలో డిసిసి అధ్యక్ష పదవి చేపట్టేందుకు జిల్లాలోని ముఖ్య నేతలంతా కూడా తమ రాజకీయ పలుకుబడితో ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో పార్టీ కోసం చేసిన కార్యక్రమాలు రాజకీయ ప్రాబల్యం సీనియర్ నేత రాజకీయ అనుభవం తదితర అంశాలను వివరిస్తూ డిసిసి అధ్యక్ష పదవిని తమకే కేటాయించాలని రాష్ట్ర అధిష్టానం పై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. జిల్లాలో నిర్మల్ ఖానాపూర్, ముధోల్ నియోజకవర్గాలు ఉండగా మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీలో నేతల మధ్య గ్రూపు వివరాలు చాప కింద నీరుల ఉండడంవల్ల డిసిసి అధ్యక్షులు ఎంపిక విషయంలో తమవారికి అవకాశం ఇవ్వాలని ఎవరికి వారి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ కార్యక్రమంలో మాత్రం డిసిసి పదవి ఎవరికి ఇచ్చిన కలిసి పని చేస్తామని చెప్తూనే క్షేత్రస్థాయిలో మాత్రం తమ వర్గానికి డిసిసి అధ్యక్ష పదవి ఇవ్వాలని పట్టుబడుతున్న నేపథ్యంలో డిసిసి అధ్యక్షుని ఎంపికపై తర్జన భర్జన జరుగుతుంది ఏదేమైనా నిర్మల్ జిల్లాలో డిసిసి అధ్యక్షుని ఎంపిక పార్టీకి పెను సవాలుగా నిలవనున్నట్టు రాజకీయ చర్చ జరుగుతుంది.నిర్మల్ జిల్లాలో గత కొన్ని రోజులుగా డీసీసీ అధ్యక్ష పదవిని ఓసి సామాజిక వర్గానికి కేటాయిస్తున్నందున ఈసారి బీసీలకు కేటాయించాలని బీసీ నేతలు పట్టుబడుతున్నారు. ముఖ్యమంత్రి రేవం త్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమా ర్‌గౌడ్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం పోరాడుతు న్న నేపథ్యంలో డిసిసి అధ్యక్షులు ఎంపికలు కూడా బీసీ వర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలని బీసీ నేతలు కోరినట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సామాజిక సమీకరణల నేపథ్యంలో డిసిసి అధ్యక్షుని ఎంపిక ముడిపై ఉన్నందున రాష్ట్ర అధిష్టానం ఏ జిల్లాలో ఏ సామాజిక వర్గానికి కేటాయించాలని తీవ్రంగా చర్చిస్తున్నట్టు తెలుస్తోంది.

మంత్రి వివేక్ వెంకటస్వామి తో పాటు సీనియర్ నేతలు మాజీ ఎమ్మెల్యేల అభిప్రాయాలను కూడా తీసుకొని డిసిసి అధ్యక్షుని ఎంపిక చేసే విధంగా పార్టీ చర్యలు తీసుకుంటుంది. ఇప్పటివరకు నిర్మల్ జిల్లా లో డిసిసి అధ్యక్ష పదవి బీసీ వర్గానికి పోవడానికి ఇతర వర్గాల ఆధిపత్యమేనని ఈసారి తమకు తప్పకుండా అవకాశం కల్పిస్తారని బీసీ నేతలు ఎదురుచూస్తున్నారు

# గృహ కార్మికుల రక్షణకు చట్టం అవసరం : సుప్రీం కోర్టు



ఇంటి పనిమనిషి (గృహ కార్మికులు) రాకపోతే ఎక్కడ పని అక్కడే ఆగిపోతుంది. ఇల్లు అస్తవ్యస్తంగా ఉంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే పట్టపగలే చుక్కలు కనిపిస్తాయి. ఇంటి పనిలో ఎంతో కీలకమైన గృహ కార్మికులకు మన దేశంలో రక్షణ ఉందా? వారికి సరైన వేతనాలున్నాయా? అంటే లేవనే సమాధానం. అందుకే సుప్రీంకోర్టు సైతం గృహకార్మికుల కోసం చట్టం అవసరమని గుర్తించింది. వారి హక్కుల కోసం

ఓ సమగ్ర చట్టాన్ని రూపొందించాలని, దానికోసం కమిటీని ఏర్పాటు చేయాలని ఈ ఏడాది జనవరిలో సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆరునెలల్లో నివేదికను సమర్పించాలని కమిటీని కోర్టు ఆదేశించింది. అయితే కేంద్ర ప్రభుత్వం ఈవిధంగా చర్యలు చేపట్టిందా లేదా అనేది మాత్రం అస్పష్టమే.

గృహకార్మికులు అసలెంతమంది?: మన దేశంలో గృహ కార్మికులు 4-90 మిలియన్ల మంది ఉండొచ్చని అంచనా. వీరిలో అత్యధికంగా మహిళలు, బాలికలు, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందినవారే కావడం గమనార్హం. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ మహిళ గృహ కార్మికురాలిని నిర్బంధించి ఢిల్లీకి అక్రమంగా రవాణా చేసిన కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఈ క్రిమినల్ చర్యల్లో భాగంగానే అసలు గృహ కార్మికుల రక్షణకు చట్టం అవసరమని అత్యున్నత న్యాయస్థానం గుర్తించింది. ఇందులో భాగంగానే చట్టాన్ని రూపొందించమని కేంద్రాన్ని సుప్రీం ఆదేశించింది. అయితే వీరు ఇళ్లలో పనిచేస్తారు. వీరి రక్షణ కోసం పని ప్రదేశాలు అంటే ఇళ్లను తనిఖీ చేయడం అసాధ్యం. అందుకే ఈ కార్మికులు వేధింపులకు గురవుతారు. ఇంటి యజమానులు వీరిపై దొంగలు అనే నిందలు మోపుతారు. ఈ కార్మికుల్లో ఎక్కువగా చిన్నారులే ఉండడం ఆందోళన కలిగించే విషయం. కొంతమంది కార్మికులు అయితే.. ఒక ఇంట్లోనే రోజంతా పనిచేస్తారు. మరికొంతమంది కొన్ని ఇళ్లలో పని కుదుర్చుకుని కేవలం కొన్ని గంటలే (గంట లేదా రెండు గంటలు) పనిచేస్తారు. అందుకే వీరికి కనీస వేతనాలు, పనిగంటలు, సెలవు దినాల విషయంలో నిబంధనల్ని రూపొందించాలన్నా, అమలు చేయాలన్నా కష్టతరం. గృహ కార్మికులు అవసరం ఉద్యోగస్తులకు చాలా అవసరం. భార్యాభర్తలు ఉద్యోగస్తులు

అయితే పొరుగు రాష్ట్రాలకు సైతం వారిని తీసుకెళతారు. ప్రత్యేకంగా చెప్పుకోవాలంటే వివిధ దేశాలకు కూడా తీసుకెళతారు. వారి రక్షణ కోసం గృహకార్మికులకంటూ జాతీయ స్థాయి ప్రత్యేక చట్టం లేకపోవడం వల్ల అటు ఆర్థికంగా కానీ, ఇటు శ్రమపరంగా కానీ వీరు అనేక విధాలుగా నష్టపోతున్నారు.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు గృహకార్మికుల సహకారం ఎంతో అవసరం. అందుకే అంతర్జాతీయ కార్మిక సంస్థ 2011లో గృహకార్మికుల హక్కులు, రక్షణలను నిర్ధారించడానికి ఒక కన్వెన్షన్ (నెం. 189)ను ఆమోదించింది. దీనికి అప్పుడు భారత్ సైతం ఓటు వేసింది. కానీ దానిని ఆచరణలో పెట్టలేదు. 1950ల నుండి జాతీయ స్థాయిలో చట్టాలను ఆమోదించడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. ఈ ప్రయత్నాలని సుప్రీంకోర్టు కూడా గుర్తించింది. గృహకార్మికుల కోసం సమగ్రమైన చట్టాన్ని డిమాండ్ చేయడానికి ప్రత్యేకంగా 2012లో జాతీయ గృహ కార్మికుల వేదిక (ఎన్‌పిడబ్ల్యు) ఏర్పడింది. 2017లో ఎన్‌పిడబ్ల్యు గృహ కార్మికుల (పని, సామాజిక భద్రత నియంత్రణ) బిల్లును రూపొందించింది. కానీ ఈ బిల్లు ఇప్పటివరకు చట్టరూపం దాల్చలేదు. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఇటీవల చట్టం చేయడానికి, దానికి కమిటీని ఏర్పాటు చేయమని కేంద్రాన్ని ఆదేశించడం స్వాగతించదగినదే. అయితే గృహ కార్మికుల ప్రతినిధులు లేకుండా.. విషయ నిపుణులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని కోర్టు వివిధ మంత్రిత్వశాఖలను ఆదేశించడం ఆందోళన కలిగించే విషయం.

తమిళనాడులో అత్యధికం: తమిళనాడులో దాదాపు 2 మిలియన్ల (20 లక్షల మంది) గృహ కార్మికులు ఉన్నారు. వీరికోసం తమిళనాడు మాన్యువల్ వర్కర్ చట్టం 1982 ప్రకారం వారికోసం ఒక సంక్షేమ బోర్డు కూడా ఏర్పాటు చేయడం జరిగింది. దీనిద్వారా నమోదైన కార్మికులు పెన్షన్లు, ప్రసూతి ప్రయోజనాలు, వారి పిల్లలకు విద్యా సహాయం, ఒకవేళ ప్రమాదానికి గురైతే.. వైద్య ఖర్చులు వంటి ప్రమాద ఉపశమనాలు వంటి ప్రయోజనాలు పొందుతారు. ఏదిఏమైనా చాలా తక్కువ సంఖ్యలోనే ప్రభుత్వ రికార్డుల్లో గృహ కార్మికులు నమోదు చేసుకున్నారు. వీరి కనీస వేతనం గంటకు 37-39 రూపాయలుగా నిర్ణయించినప్పటికీ

ఈ కార్మికులు చాలా తక్కువే వేతనం పొందుతారు. ఎందుకంటే వీరు ఒకే ఇంట్లో ఫుల్ టైమ్ వర్క్ చేయరు. అందుకే వారిని పార్ట్‌టైమ్ వర్కర్లుగానే చూస్తారు. ఇలాంటి అన్యాయాలకు వ్యతిరేకంగా దిండిగల్‌కు చెందిన ఒక గృహ కార్మికుడు దాఖలు చేసిన పిటిషన్‌కు మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ స్పందించింది. గృహ కార్మికులను రక్షించడానికి ప్రత్యేక చట్టాన్ని రూపొందించే విషయాన్ని పరిశీలించాలని మద్రాస్ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

పరిష్కార మార్గాలు: గృహ కార్మికుల కోసం కర్ణాటక ప్రభుత్వం గృహ కార్మికుల (సామాజిక భద్రత, సంక్షేమం) బిల్లు 2025ను ప్రవేశపెట్టినట్లు ప్రకటించింది. ఈ బిల్లు గృహ కార్మికుల పని పరిస్థితులను నియంత్రిస్తుంది. ఈ బిల్లు ప్రకారం ఇంటి యజమానులు ప్రభుత్వ రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేయాలి. ఇలా నమోదు చేయడం వల్ల ఆ కార్మికులకు కనీస వేతనాలు, ఓవర్ టైం జీతం, వారాంతపు సెలవులు పొందేందుకు అర్హత ఉంటుంది. ముఖ్యంగా గృహ కార్మికులకు సంక్షేమ ప్రయోజనాలను పంపిణీ చేసే సంక్షేమ నిధికి యజమానుల వేతనాల్లో 5 శాతం విరాళంగా ఇవ్వాలి. ఇంటి పనివారికి కనీస వేతనాలు నిర్ణయించే 12 రాష్ట్రాల్లో తమిళనాడు ఒకటి. వీరికిచ్చే వేతనాలను మార్చాలి. వాటిని పెంచాలి. ఇలా అన్ని రాష్ట్రాలు గృహ కార్మికులకు కనీస వేతనాలను నిర్ణయించాలి. కానీ అది జరగడం లేదు. ఎన్‌పిడబ్ల్యు ముసాయిదా బిల్లు, కర్ణాటక చట్టంలో పేర్కొన్న నిబంధనలతోపాటు.. యజమానులు, ఉపాధి సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఎన్‌పిడబ్ల్యు సిఫార్సు చేస్తుంది. యజమానులు, ఉద్యోగులు, రాష్ట్రంతో కూడిన త్రైపాక్షిక బోర్డు ద్వారా ప్రతి యజమానికి వర్క్‌బుక్ జారీ చేయాలి. దీనిని ప్రతి యజమాని లేదా ఉద్యోగి తీసుకుని నిర్వహించాలి. ఈ బుక్‌లో ఉన్న నిబంధనల్ని ప్రతినెలా అమలు చేయాలి. పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం, పరిష్కారం)చట్టం కింద ఏర్పాటైన స్థానిక ఫిర్యాదుల కమిటీలకు సైతం సంప్రదించలేకపోతున్నట్లు మహిళా కార్మికులు ఫిర్యాదు చేశారు. అందుకే మహిళల కోసం ఈ ఫిర్యాదుల కమిటీలను పంచాయతీ, పట్టణ స్థానిక సంస్థల్లో కూడా ఏర్పాటు చేయాలి. అప్పుడే మహిళలు స్వేచ్ఛగా పని చేయగలుగుతారు.కరోనా లాక్‌డౌన్ సమయం 2020-21 సంవత్సరాల్లో వీరి పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. ఎందుకంటే వీరు పనిచేసేది ఇళ్లలోనే. కరోనా వ్యాప్తి చెందుతుందనే భయాందోళనల్లో ఇంటి యజమానులు వీరిని పనికి రానివ్వలేదు.

దీంతో వారు ఆర్థిక ఇబ్బందులనెదుర్కొన్నారు. ఇంటి అద్దె కూడా చెల్లించలేని పరిస్థితి. అయితే ఈ సమయంలో తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం వీరికి కొంత ఆర్థిక సహాయం చేసింది. వీరి కోసం తాత్కాలిక ఉపశమచన చర్యలు కాకుండా.. కీలకమైన శ్రామికశక్తిలో మహిళలను రక్షించడానికి నిర్మాణాత్మక పరిష్కారాలు తప్పనిసరి.

## వరిలో చీడపురుగులు ఆశిస్తే నివారణ మార్గం ఒక్కటే



**కమాన్ పూర్ ,తెలంగాణ దిశ:** వరి లో చీడపీడల పట్ల రైతు లు సలహాలు సూచనలు పాటించాలి అని వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ రైతులను కోరారు.. పాలకుర్తి మండలం కన్నాల గ్రామం లో క్షేత్ర పర్యటన లో పలు సూచనలు రైతులకు చేసారు... పత్తి రైతులు విధిగా కపాస్ కిసాన్ యాప్ లో తమ వివరాలు నమోదు చేసుకోవాలి పేర్కొన్నారు .వరిలో కంకి నల్లి అనేది వరి పంటను ఆశించి, కంకులను దెబ్బతీసే ఒక చీడపీడ,ఇది కంకుల్లోని గింజలను తిని వాటిని నాణ్యత లేకుండా చేయడం, పాలు పోసుకోకుండా చేయడం మరియు తాలు గింజలుగా మారేలా చేయడం వంటి నష్టాన్ని కలిగిస్తుంది అని పేర్కొన్నారుఈ కంకి నల్లి వల్ల పంట దిగుబడి గణనీయంగా తగ్గుతుంది,దీని నివారణ చర్యలు కోసం రసాయన మందులు స్పైరోమెసిఫెన్ 240 ఎస్.సి (22.9%), ప్రాపర్గోట్ లేదాఓమైట్, ఫైన్పైర్ ఆక్సిమేట్ వంటి మందులు అత్యంత ప్రభావం చూపుతాయి కావున ఇవి ముందస్తుగా పిచికారీ రైతులు వ్యవసాయ అధికారి సూచనల మేరకు చేసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ మరియు వరి సాగు రైతులు ,భూతగడ్డల లక్మయ్య,కాగితాల సత్తయ్య, చందు మరియు కన్నం అరుణ్ కుమార్ రైతులు పాల్గొన్నారు.

## బీసీలకు రక్షణ చట్టాలు కల్పించాలి

**బీసీ ముస్లీం జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుడు మహమ్మద్ యూసుఫ్**



**జమ్మికుంట,తెలంగాణ దిశ :** ఎస్సీ, ఎస్టీలకు ఏ విధంగానైతే రక్షణ చట్టాలు ఉన్నాయో అదే మాదిరిగా బీసీలకు కూడా రక్షణ చట్టాలు కల్పించాలని బీసీ ముస్లీం( ఏబిఈ) తెలంగాణ రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుడు మహమ్మద్ యూసుఫ్, డిమాండ్ చేశారు.

హైదరాబాద్ లోని ఇందిరాపార్కు వద్ద విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధనకై బీసీ రిజర్వేషన్ బిల్లును 9వ, షెడ్యూల్ లో చేర్చాలనే డిమాండ్ తో నిర్వహించిన మహా ధర్నాలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా మహమ్మద్ యూసుఫ్, మాట్లాడాతు.

అత్యంత వెనకబడిన బీసీ కులాలకు స్థానిక సంస్థల్లో ఉప వర్గీకరణ చేసి రిజర్వేషన్ కల్పించాలని, బీసీలకు సంబంధించిన బడ్జెట్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నామినేటెడ్, కార్పొరేషన్ పదవుల్లో సామాజిక న్యాయం పాటించి బీసీ, ఎస్సీ, ఎస్టీ లకు దామాషా ప్రకారం నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రాణాలు తీస్తున్న నిర్లక్ష్యం

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**హైదరాబాద్ శివారులోని పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధి దూలపల్లి పారిశ్రామిక వాడలో గురువారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. క్రౌన్ పాలిమర్ పరిశ్రమలో షాట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అగ్ని మాపక సిబ్బంది ఘటన స్థలం చేరుకొని మంటలను10 గంటలు శ్రమించి 5 ఫైరింజన్లతో మంటలను అదుపు చేశారు. సరియైన ఫైర్ సేఫ్టీ లేకపోవడమే? ఇంతటి పెద్ద అగ్ని ప్రమాదానికి కారణమని తెలుస్తోంది.దట్టమైన పొగలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. 5 ఫైర్ ఇంజిన్లు, ఒక రోబో మిషన్, 2 అంతస్తులకు ఫైర్ అంటుకోవడంతో మంటలు ఆర్పేందుకు ఫైర్ సిబ్బందితో పాటు డిఆర్ఎఫ్ సిబ్బంది, పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ సహకారంతో మంటలు ఆదుపులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నారు. క్రౌన్ పాలిమర్ పరిశ్రమకు సరైన ఫైర్ సేఫ్టీ లేకపోవడమే ఈ అగ్ని ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ప్రమాదం జరిగిన బిల్డింగ్ స్టీల్ ప్లేస్ త్రీ ఫ్లోర్స్ ఉండడం పైప్ లైన్‌తో ఉండాల్సిన ఫైర్ సేఫ్టీ నామమాత్రపు అనుమతులతో ఈ పరిశ్రమ నడుస్తున్నట్టు సమాచారం. జీడిమెట్ల పారిశ్రామిక వాడ మరియు దూలపల్లి పారిశ్రామికవాడలో అనేక కంపెనీలలో కంపెనీకి తగ్గట్టుగా సరియైన ఫైర్ సేఫ్టీ లేకపోవడం ఇలాంటి భారీ అగ్ని ప్రమాదాలకు దారితీస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేస్తారని ఫైర్ అధికారులపై ఫైర్ అవుతున్నారు. తర్వాత వెళ్లిపోతారని పట్టించుకోరని అంటున్నారు. కొన్ని కంపెనీలకు ఫైర్ ఎన్‌ఓసీలు లేకుండా కూడా నడిపిస్తున్నారు. అగ్నిప్రమాదాలకు సంబంధించిన ఘటనలు అనేకంగా జరిగిన అటు అధికారులు కావచ్చు ఇటుకంపెనీ యాజమాన్యాలుకావచ్చు తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకోకపోవడమే ఈ అగ్ని ప్రమాదాలకు కారణమని స్థానికులు తెలిపారు. ఒక కంపెనీ ప్రారంభిస్తున్నారు అని అంటే కంపెనీకి సంబంధించిన ఎన్వోసీలు ప్రతి డిపార్ట్మెంట్ నుంచి ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్స్పెక్టర్ వచ్చి పరిశీలించాలి. ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్స్పెక్టర్ తనిఖీలు సరిగ్గా చేయకపోవడమే ఇలాంటి ప్రమాదాలు పునరావృతం అ?తున్నాయని స్థానికులు తెలిపారు. అన్ని డిపార్ట్మెంట్ అధికారులు ప్రమాదాలు జరిగినప్పుడే వచ్చి హడావుడి చేయడం షరా మామూలుగా మారింది. క్రౌన్ పాలిమర్ కంపెనీల్లో ఆస్తి నష్టమే జరిగింది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణాష్టం జరగలేదు. ప్రాణనాష్టం జరిగితే సంబంధిత అధికారులు బాధ్యత వహిస్తారా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కంపెనీల్లో ఎలాంటి ఫైర్ సేఫ్టీ ఉంది? కంపెనీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలుసరిగా ఉన్నాయా లేవాఅనిఅధికారులు వచ్చి తరచూ తనిఖీలు నిర్వహిస్తే బాగుంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. క్రౌన్ పాలిమర్ కంపెనీ పైన సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే మరి.

## విశాఖలో కంటైనర్ మెగా పోర్టు

**- రాష్ట్రానికి నీతిఆయోగ్ సూచన**

విశాఖపట్నంలో కంటైనర్ మెగా పోర్టును ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నీతి ఆయోగ్ సూచించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తో నీతిఅయోగ్ సిఇఓ సుబ్రహ్మణ్యం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఈ మేరకు సూచించిచారు. తూర్పుతీరంలో వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముందున్నట్లు ఆయన చెప్పారు. కేంద్రం అమలు చేస్తున్న పూర్వోదయ పథకం ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించిన ఆయన అందులో భాగంగానే విశాఖ గ్రోత్ హబ్ పైనా చర్చించారు. ఈ పథకం ద్వారా తీర ప్రాంతంలో అనేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆస్కారం ఉందన్నారు. రాష్ట్రంలో అనేక ఓడరేవులు ఉన్నప్పటికీ వాటికి అదనంగా కంటైనర్ మెగా పోర్టును ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఆ దిశగా ప్రయత్నాలు చేయాలని ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సూచించారు. త్వరలో జరగనున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల సమావేశంలో సమగ్రాభివృద్ధిపై చర్చ ఉంటుందని సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఇందుకోసం వినూత్న పథకాలపై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చేందుకు వీలుగా నివేదికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇదే సమయంలో విశాఖ, అమరావతి, తిరుపతి గ్రోత్ కారిడార్ల ఏర్పాటు, దానివల్ల కలిగే ప్రయోజనాల పైనా సమీక్షించారు. సిఎస్ విజయానంద్ మాట్లాడు తూ విశాఖ గ్రోత్ హబ్ పనుల వేగవంతానికి ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించనున్నట్లు తెలిపారు. కేంద్రం



నుంచి అవసరమైన నిధులు వచ్చేలా నీతి ఆయోగ్ సిఫార్సు చేయాలని సుబ్రహ్మణ్యంను కోరారు.

ఏమిటీ 'పూర్వోదయం' ?: తూర్పు తీరంలో ఉన్న ఆంధ్రా, ఒడిషా, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో అభివృద్ధికోసం పూర్వోదయ పథకాన్ని ఏర్పాటు చేశారు. సాంస్కృతిక వారసత్వం, సహజ వనరుల ను ఉపయోగించుకోవడంద్వారా మౌళిక వసతుల ను సృష్టించుకోవడం, ఉపాధి అవకాశాలను పెంచు కోవడం, స్థిరమైన ఆర్థికాభివృద్ధిని సాధించడం ఈ పథకం లక్ష్యాలు, మౌళికాభివృద్ధిలో భాగంగా రహదారులు, వంతెనల నిర్మాణం, విమానాశ్రయాలు, ఓడరేవులు, విద్యుత్ ప్లాంట్లు వంటివి ఏర్పాటుచేస్తారు.. ఈ భేటీలో నీతి ఆయోగ్ అదనపు సిఇఓ పార్థసారధిరెడ్డి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్కుమార్, విద్యాశాఖ కార్యదర్శి శశిధర్, ఆర్థికశాఖ కార్యదర్శి వినయ్చంద్, ప్రణాళికశాఖ సంయుక్త కార్యదర్శి అనంత్ శంకర్, నైపదుణ్యాభివృద్ధి సంస్థ ఎండి గణేష్కుమార్ పాల్గొన్నారు.

## కుమారుడి యాదిలో దాతృత్వం చాటిన దంపతులు



**రామగుండం,తెలంగాణ దిశ :**చేతికందివచ్చిన చెట్టంత కొడుకును కోల్పోయిన పుట్టెడు దుఃఖంలోనూ ఓ అభాగ్య కుటుంబానికి ఆపన్న హస్తం అందించడానికి ముందుకొచ్చారు గోదావరిఖని కాకతీయ నగర్ కు చెందిన సిరిపురం శ్రీనివాస్-మమత దంపతులు. గత సంవత్సరం రోడ్డు ప్రమాదానికి గురై మరణించిన తమ కుమారుడు సిరిపురం వంశీ ప్రథమ వర్ధంతి సందర్భంగా, ఆయన స్మారకార్థం.. ప్రమాదానికి గురై అచేతన స్థితిలో ఉన్న స్థానిక గంగా నగర్ కు చెందిన మమతగిరి సతీష్ కుటుంబానికి నెలరోజులకు సరిపడా నిత్యావసర సరుకులను శ్రీనివాస్, మమత దంపతులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు మాట్లాడుతూ పుట్టెడు దుఃఖంలో కూడా కుమారుడి యాదిలో ఇతరులకు సహాయపడడం అభినందించదగిన విషయమన్నారు. ఈ నిస్సహాయ కుటుంబానికి సహాయంచేయడానికి దాతలు ముందుకు రావాలని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సతీష్ తల్లి శోభమ్మ, భార్య ఉమతోపాటు శ్రీనివాస్ కుటుంబసభ్యులు వాణి, కళాకారులు మేజిక్ రాజా, కాసిపాక రాజమౌళి, బోడకుంట వెంకట్రాజం, వెంకటలక్ష్మి, మాదరి వాసు, బీరుక లక్ష్మణ్, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఏ టూ జడ్ మెడికల్ షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే




**జయశంకర్,తెలంగాణ దిశ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జంగేడు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఏ టూ జడ్ మెడికల్ షాపును భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యేకు షాపు నిర్వాహకులు పూల బొకే అందించి స్వాగతం పలికారు. షాపును ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. భూపాలపల్లి ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఔషధాలు, వైద్య అవసరాలన్నీ ఒకేచోట లభించే విధంగా ఏ టూ జడ్ మెడికల్ షాపు ను ప్రారంభించడం ఆనందకరమని ఎమ్మెల్యే అన్నారు.

ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని నిర్వాహకులకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం దుకాణ యజమానులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండే మెడికల్ సేవలను అందిస్తామన్నారు.

అనంతరం నిర్వాహకులకు ఎమ్మెల్యే శాలువాలు కప్పి అభినందించారు. ఎంచుకున్న రంగంలో దినదినాభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు పట్టణ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

# దేశంలో డిజిటల్ పేమెంట్స్ హవా.. 99.7 శాతం ఆన్‌లైన్ చెల్లింపులే




**డిజిటల్ ఇండియా**

**గత ఏడాది లావాదేవీల వివరాలను వెల్లడించిన ఆర్బీఐ**

**ఈ ఏడాది ప్రథమార్ధంలోనూ కొనసాగిన**

ముంబై,: గత ఏడాది దేశంలో జరిగిన పేమెంట్ లావాదేవీల వివరాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. 2024లో జరిగిన చెల్లింపుల్లో 99.7 శాతం లావాదేవీలు నెఫ్ట్, ఐఎంపీఎస్, ఆర్టీజీఎస్, నాచ్, డెబిట్-క్రెడిట్ కార్డులు, యూపీఐ, ఇతర ప్రీ-పెయిడ్ పేమెంట్ సాధనాల వంటి డిజిటల్ పేమెంట్ వేదికల ద్వారానే జరిగినట్టు తెలియజేసింది. మొత్తం లావాదేవీల విలువలో వీటన్నిటి వాటా 97.5 శాతంగా ఉన్నట్టు సెంట్రల్ బ్యాంక్ వివరించింది. చెక్కుల రూపంలో జరిగిన చెల్లింపుల విలువ 2.3 శాతంగా ఉన్నట్టు పేర్కొన్నది. దీంతో నగదు లావాదేవీల విలువ కేవలం 0.2 శాతానికే పరిమితమైనట్టు తేలింది.

ఈ ఏడాదిలోనూ..: అర్ధ వార్షిక పేమెంట్ సిస్టమ్ రిపోర్ట్-జూన్ 2025 పేరిట ఆర్బీఐ విడుదల చేసిన తాజా నివేదికలో ఈ ఏడాది ప్రథమార్ధం (జనవరి-జూన్)లోనూ డిజిటల్ పేమెంట్స్‌దే హవా కొనసాగినట్టు రుజువైంది. ఇక వీటిలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) వాటానే 85 శాతం (10,637 కోట్లు)గా ఉండటం గమనార్హం. అయితే మొత్తం లావాదేవీల విలువలో వీటి వాటా 9శాతమే (రూ.143.3 లక్షల కోట్లు). గత ఏడాది ఇవి వరుసగా 17,221 కోట్లు, రూ.246.8 లక్షల కోట్లుగా ఉన్నాయి. 2019లో రూ.18.4 లక్షల కోట్ల విలువైన 1,079 కోట్ల లావాదేవీలు జరిగాయి. కాగా, రియల్ టైమ్ గ్రాస్ సెటిల్మెంట్ (ఆర్టీజీఎస్) సిస్టమ్ ద్వారా జరిగిన చెల్లింపుల విలువ అత్యధికంగా 69 (రూ.1,079.2 లక్షల కోట్లు) శాతంగా ఉన్నది. అయినప్పటికీ లావాదేవీల సంఖ్య 0.1 శాతం (16.1 కోట్లు)మాత్రమే. దీంతో భారీ లావాదేవీలకు ఆర్టీజీఎస్ నే అంతా ఎంచుకుంటున్నట్టు స్పష్టమవుతున్నది. చిన్న పేమెంట్స్ అన్నీ యూపీఐ ద్వారానే ఎక్కువగా జరుగుతుండటంతో సంఖ్యాప రంగా లావాదేవీల్లో ఇవే ఎక్కువగా కనిపిస్తున్నాయని ఆర్బీఐ వర్గాలు చెప్తున్నాయి. ఇదిలావుంటే నిరుడు లావాదేవీల్లో ఆర్టీజీఎస్‌వి 29.5 కోట్లుగా ఉన్నాయి. వీటివిలువ రూ.1,938.2 లక్షల కోట్లు. 2019లో ఇవి వరుసగా 14.8 కోట్లు, రూ.1,388.7 లక్షల కోట్లుగా ఉన్నాయి. నెఫ్ట్‌కు పెరిగిన ఆదరణ: 2019 నుంచి 2024 వరకు గమనిస్తే.. నెఫ్ట్ లావాదేవీలు సంఖ్యాపరంగా మూడింతలకుపైగా ఎగబాకాయి. 262.2 కోట్ల నుంచి 926.8 కోట్లకు చేరాయి. విలువ కూడా రూ.232.9 లక్షల కోట్ల నుంచి రూ.432.8 లక్షల కోట్లకు పెరిగింది. ఈ ఏడాది జనవరి-జూన్‌లో రూ.237 లక్షల కోట్ల విలువైన 490.5 కోట్ల లావాదేవీలు జరిగాయి. క్రెడిట్ కార్డు లావాదేవీలు నిరుడు 447.2 కోట్లుగా ఉన్నాయి. విలువ రూ.20.4 లక్షల కోట్లు. 2019లో ఇవి వరుసగా 208.7 కోట్లు, రూ.7.1 లక్షల కోట్లే. ఈ ఏడాది ప్రథమార్ధంలో రూ.11.1 లక్షల కోట్ల విలువైన 266.3 కోట్ల లావాదేవీలు జరిగాయి. గత ఏడాది చెక్కుల ద్వారా జరిగిన లావాదేవీల విలువ రూ.2,830 లక్షల కోట్లు. 20,849 కోట్ల లావాదేవీలు జరిగాయి. 2019లో రూ.1,775 లక్షల కోట్లుగా, 3,248 కోట్ల లావాదేవీలుగా ఉన్నాయి. 2025 జనవరి-జూన్‌లో చెక్కుల రూపంలో జరిగిన 12,549 కోట్ల లావాదేవీల విలువ రూ.1,572 లక్షల కోట్లు. 2019 పేమెంట్స్‌లో 96.7 శాతం లావాదేవీలు డిజిటల్ పేమెంట్సే. చెల్లింపుల విలువలో 95.5 శాతంగా ఉన్నాయి. 2024లో ఇవి వరుసగా 99.7 శాతంగా, 97.5 శాతంగా ఉన్నాయి. 2025 జనవరి-జూన్‌లో నమోదైన లావాదేవీల్లో 99.8% డిజిటల్ పేమెంట్సే. విలువలో వీటి వాటా 97.7 శాతం. 2019 నుంచి తగ్గుముఖం పడుతున్న డెబిట్ కార్డుల ద్వారా జరిగే లావాదే వీలు. బ్యాంకులు, ఏటీఎంలలో నగదు ఉపసంహరణలకు మాత్రమే వినియోగం. పెరుగుతున్న క్రెడిట్ కార్డు లావాదేవీలు. ఆన్‌లైన్‌లో విశేషంగా వాడుతున్న వినియోగదారులు. క్రెడిట్ కార్డు లావాదేవీల్లో కొనసాగుతున్న ప్రైవేట్ రంగ బ్యాంకుల హవా. కో-బ్రాండెడ్ ఆఫర్లతో కస్టమర్లను ఆకట్టుకుంటున్న సంస్థలు. ఈ ఏడాది జూన్ నాటికి 10 లక్షల కార్డులను జారీ చేసిన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు. అందరికీ యూటీఐ తప్పనిసరి: వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఫారిన్ కరెన్సీ డెరివేటివ్‌లు, రూపీ వడ్డీరేటు కోసం ఓవర్-ది-కౌంటర్ (ఓటీసీ) మార్కెట్లలో అన్ని లావాదేవీలకు యూనిక్ ట్రాన్సాక్షన్ ఐడెంటిఫైయర్ (యూటీఐ)ను తప్పనిసరి చేయాలని ఆర్బీఐ ప్రతిపాదించింది. ఈ మేరకు గురువారం 'యూటీఐ ఫర్ ఓటీసీ డెరివేటివ్ ట్రాన్సాక్షన్స్ ఇన్ ఇండియా'పై ఓ డ్రాఫ్ట్ సర్క్యులర్‌ను విడుదల చేసింది. ఓటీసీ డెరివేటివ్‌లు ఫైనాన్షియల్ డెరివేటివ్ కాంట్రాక్టులు. రెగ్యులేటెడ్ ఎక్స్ఛేంజీల్లో కాకుండా రెండు పార్టీల మధ్య నేరుగా ట్రేడ్ అవుతాయి. మరోవైపు నూతన సాంకేతిక పరిష్కారాల కోసం ఆర్బీఐ ఓ గ్లోబల్ హ్యాకథాన్‌ను ప్రారంభించింది.

# పైకప్పుపైనా క్యాలీఫ్లవర్



ఇంటి పెరటిలో గానీ, టెర్రస్ పైనగానీ, అపార్ట్‌మెంట్ బాల్కనీల్లో గానీ పెంచుకోవడానికి క్యాలీఫ్లవర్ అనువుగా ఉంటుంది. అనేక పోషకాలతో నిండిన ఈ కాయగూరను ఏడాదంతా తినొచ్చు. విటమిన్ సి, కెతోపాటు పొటాషియం, మాంగనీస్, ప్రొటీన్‌లు అధికంగా లభించే క్యాలీఫ్లవర్.. శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. హృదయ సంబంధిత వ్యాధులు, వివిధ రకాల క్యాన్సర్ల ప్రభావాన్నీ తగ్గిస్తుంది. ఇలాంటి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు అందించే క్యాలీఫ్లవర్‌ను ఇంటివద్దే సులభంగా పెంచేయొచ్చు. సెప్టెంబర్ -అక్టోబర్ మధ్యలో విత్తనాలు వేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. కాబట్టి, మార్కెట్లో అందుబాటులో ఉన్న క్యాలీఫ్లవర్ విత్తనాలు, మొక్కలు తెచ్చి నాటుకుంటే సరిపోతుంది. మొక్కను నాటిన 55 నుంచి 60 రోజుల్లోనే క్యాలీఫ్లవర్ తయారవుతుంది. అయితే, క్యాలీఫ్లవర్ పెరిగేందుకు సేంద్రియ పదార్థం ఎక్కువగా ఉండే మట్టి అవసరం. 6.0 నుంచి7.0 మధ్య పీహెచ్ పరిధిలో ఈ మొక్క బాగా పెరుగుతుంది. క్యాలీఫ్లవర్ పువ్వు తెల్లగా, మచ్చలు లేకుండా ఉండాలంటే.. పెరుగుతున్న పువ్వులోకి సూర్యరశ్మి చేరకుండా జాగ్రత్త పడాలి. ఇందుకోసం పువ్వు చుట్టూ ఉండే ఆకులలో చివరి వరుస ఆకులను రబ్బరు బ్యాండ్‌తో కట్టాలి. పువ్వు సరైన పరిమాణంలో పెరిగిన తర్వాత కోసుకోవాలి.

# ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు



**కరీంనగర్,తెలంగాణ దిశ :** క్రీడల ద్వారా ద్వారా విద్యార్థులకు ఒత్తిడి నుండి ఉపశమనం కలుగుతుందని కార్యకలాపాలను చాలా ఉషారుగా పూర్తి చేయవచ్చని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇ- టెక్నో పాఠశాలలో విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి అభినందన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ క్రీడల్లో నైపుణ్యం వచ్చే విధంగా శిక్షణ ఇప్పించాలని క్రీడలలో నైపుణ్యం పొందడానికి కావలసినటు వంటి వనరులను సైతం సమకూర్చి వారికి అందించినట్లయితే విజయం తద్యమవుతుందని వారు ఆశ భావం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు సైతం విద్యార్థులకు ఇష్టమైనటువంటి రంగాలలో శిక్షణ ఇప్పించి నైపుణ్యం సాధించే విధంగా ప్రోత్సాహం అందించాలని కోరారు. పాఠశాల స్థాయిలో ప్రాథమికంగా ఎంపిక పోటీ నిర్వహించి వివిధ స్థాయిలలో నిర్వహింపబడేటువంటి పోటీలకు ప్రాతినిధ్యం వహించే విధంగా ప్రోత్సాహాన్ని అందిస్తున్నామని వారు చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేటలో నిర్వహించినటువంటి జోనల్ స్థాయి ఎస్జీఎఫ్ బాల బాలికల హ్యాండ్ బాల్ పోటీలలోపాఠశాలకు చెందినటువంటి జి.సుశాంత్,9తరగతి, డి.మహిత్ రెడ్డి 10వ తరగతి అండర్ -17 విభాగంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచడమే కాకుండా త్వరలో నిర్వహించబోయేటువంటి రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం ఇవ్వబో తున్నారని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు మన విద్యార్థులు పాల్గొన్నారు.

# సిగ్గుల మొగ్గ కావొద్దంటే!?



ఇంటికి కొత్తగా వచ్చిన బంధువులతో కొందరు పిల్లలు సరిగ్గా కలవలేరు. సిగ్గు పడుతూ.. బిడియంతో ముడుచుకు పోతారు. ఇంటి కొచ్చిన అతిథుల విషయంలోనే కాదు.. క్లాస్‌లో తోటి విద్యార్థులతోనూ సరిగ్గా కలవలేరు.దాంతో, వారి ఫ్రెండ్స్ లిస్ట్‌లో కొద్దిమందే ఉంటారు. అయితే, ఇలాంటి సమస్యను బాల్యంలోనే గుర్తించి.. వారిలో మార్పు తీసుకురావాలని నిపుణులు సూచిస్తున్నారు. లేకుంటే, పెద్దయ్యాక అంతర్ముఖులుగా తయారయ్యే అవకాశం ఉంటుందని హెచ్చరిస్తున్నా రు. అంతేకాదు..ఈ అలవాటుదీర్ఘకాలం లోవారిలో నమ్మకం, సామాజి క సంబంధాలపై ప్రభావం చూపుతుందనీ చెబుతున్నారు. పిల్లల్లో సిగ్గూ, బిడియం తగ్గాలంటే.. కొన్ని సలహాలు, సూచనలు పాటించా లని సూచిస్తున్నారు. పిల్లలు ఎక్కువగా సిగ్గు పడుతున్నారం టే.. ఇందుకు జన్యుపరమైన కారణాలు, గత అనుభవాలు, వ్యక్తిత్వ లక్షణా లు కారణం కావచ్చు. కాబట్టి, ముందుగా మీ పిల్లల సమస్య ఏమిటో గుర్తించండి. వేర్వేరు పరిస్థితుల్లో వారి ప్రవర్తనను గమనించండి. జన్యుపరమైన కారణాలైతే.. వైద్య నిపుణులను సంప్రదించాలి. ఇక గత అనుభవాలు, వ్యక్తిత్వ లక్షణాలతో సిగ్గుపడుతుంటే.. వారికి తగిన సూచనలు ఇవ్వండి. ఎట్టిపరిస్థితుల్లోనూ పిల్లవాడిపై 'సిగ్గరి' అనే ముద్రను వేయకండి. ఇది వారి మానసిక అభివృద్ధిని అడ్డుకుంటుంది. వారిలో నమ్మకాన్ని తగ్గిస్తుంది. పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచండి. తమపై తమకు నమ్మకం ఉన్న పిల్లలు.. సిగ్గుపడే అవకాశం తక్కువగా ఉంటుంది. మీ పిల్లల్లో దాగిఉన్న ప్రతిభను గుర్తించి.. దాన్ని ప్రోత్స హించండి. ఆటలు, చిత్రకళ, గానం.. ఇలా వారికి ఆసక్తి, సామర్థ్యం ఉన్న రంగంలో పిల్లలకు మద్దతుగా నిలవండి. తాను ప్రతిభావంతుడు, సమర్థుడినని తెలుసుకున్న పిల్లలు.. సామాజికంగా మరింత ధైర్యంగా వ్యవహరిస్తారు. పిల్లల చుట్టూ ఉండే వాతావరణం ఎప్పుడూ వారికి సురక్షితంగా అనిపించాలి. అప్పుడే, వారు ఇతరులతో కనెక్ట్ కావడానికి ఆసక్తి చూపుతారు. వాతావరణం తమకు నచ్చినట్లుగా ఉంటే.. పిల్లల్లో ఆందోళన తగ్గుతుంది. వారిలో నమ్మకాన్నీ పెంచుతుంది.

దాంతో, బిడియం తగ్గుతుంది. పిల్లలు ఇతరులతో కలిసేలా, వారితో మాట్లాడేలా ప్రోత్సహించాలి. ఇతరులతో స్నేహంగా మెలిగినప్పుడు.. పిల్లల్లో సిగ్గు, బిడియం తగ్గుతుంది. వారిలో సామాజిక నైపుణ్యాలు, నమ్మకాన్ని పెంచడానికి సహాయపడుతుంది. ఇక పిల్లలకు తప్పకుండా నేర్పించాల్సిన మరో సామాజిక నైపుణ్యం.. ఇతరులను పలకరించడం. ఇందుకు వారి మిత్రులే అవ్వాల్సిన అవసరం లేదు. మీ స్నేహితులు, బంధువులు ఎదురుపడినా.. విష్ చేసేలా పిల్లల్ని ప్రోత్సహించాలి. పిల్లలు స్వతంత్రంగా విజయాలు సాధించడం మంచిదే! అదే సమయంలో.. సామాజికంగానూ, బృందంగానూ విజయం సాధించేలా వారికి అవకాశాలను కల్పించండి. నలుగురితో కలిసి ఆడుకోవడాన్ని ప్రోత్సహించండి.

# జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ



**కరీంనగర్ ,తెలంగాణ దిశ :**స్థానిక కరీంనగర్ లోని మంకమ్మతోట దగ్గర్వాడి ప్రభుత్వ పాఠశాలలో జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలను వెయిట్ లిఫ్టింగ్ అసోసియే షన్ వారు నిర్వహించడం జరిగింది. ఇట్టి పోటీలలో సిద్ధార్థ విద్యాసంస్థ ల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 94 కేజీల విభాగంలో ఎమ్.డి. అయాన్ 60 కేజీల విభాగంలో ఎమ్.డి. సులేమాన్ గోల్డ్ మెడల్ సాధించారు. నవంబర్లో హన్మకొండలో 7, 8, 9వ తేదీలలో జరగబోయే రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కరబరిచి స్వర్ణపతకాలు సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి అభినందిస్తూ, పాఠశాలకుతల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకొని రావాలని రాష్ట్రస్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని విద్యార్థులనుద్దేశించి అన్నారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి డైరెక్టర్ స్వప్న శ్రీపాల్ రెడ్డి ఉపాధ్యాయ బృందం ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.

# అందానికి ఆలుగడ్డ!

శీతాకాలం మొదలైంది. చల్లని వాతావరణంలో చర్మం కళావిహీనమవుతుంది. చలి గాలులతో చర్మం నిర్జీవంగా మారి.. ముఖం పాలిపోయినట్లు కనిపిస్తుంది. దీని నుంచి తప్పించుకోవడానికి రకరకాల క్రీములు, లోషన్లు వాడాల్సిన అవసరం లేదు. కేవలం వంటింట్లో దొరికే ఆలుగడ్డలతో.. చలిబారి నుంచి అందాన్ని కాపాడుకోవచ్చు.చర్మాన్ని కాంతివంతం చేసే గుణాలు ఆలుగడ్డలో పుష్కలం. ముఖంపై మొటిమలు, మచ్చలను తొలగించడంలో ఇది సమర్థంగా పనిచేస్తుంది. బంగాళాదుంప నుండి రసాన్ని తీసి.. ముఖానికి బాగా పట్టించాలి. 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా రోజూ రెగ్యులర్‌గా చేస్తుంటే.. ముఖంపై మొటిమలు, మచ్చలు పోతాయి.ఆలుగడ్డల్లో ఉండే ఎంజైమ్‌లు, విటమిన్లు సూర్యరశ్మి వల్ల దెబ్బతిన్న చర్మాన్ని బాగుచేయడంలో ముందుంటాయి. ఇవి చర్మం లోపలి నుండి పోషణను అందిస్తాయి. వాపు, నొప్పి వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తాయి. ఆలుగడ్డను సన్నగా, గుండ్రంగా కట్‌చేసి.. సమస్య ఉన్న ప్రాంతంలో అప్లయి చేయాలి. అరగంట తర్వాత చల్లటి నీటితో కడిగేస్తే సరి. ఆలుగడ్డలను మిక్సీలో వేసి మెత్తని పేస్టుగా చేసుకోవాలి. ఆ పేస్టుని ముఖానికి రాసుకుని అరగంట తర్వాత కడిగేస్తే.. చర్మం మృదువుగా మారుతుంది. చర్మంపై జిడ్డును తొలగిస్తుంది. ఆలుగడ్డల రసానికి నిమ్మరసం, తేనె కలిపినా మంచి ఫలితం కనిపిస్తుంది. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి, పావుగంట తర్వాత కడిగేస్తే.. ముఖ ఛాయ



మెరుగుపడుతుంది.నిద్రలేమి, ఇతర సమస్యలతో కళ్ల చుట్టూ నల్లటి వలయాలు ఏర్పడతాయి. ఆలుగడ్డ రసంలో మెత్తని దూదిని ముంచి.. దానిని కళ్లపైన పెట్టి, పావుగంట అలాగే ఉంచాలి. లేకుంటే, ఆలుగడ్డను సన్నని ముక్కలు (చిప్స్ మాదిరి)గా కోసి.. వాటిని కళ్లపైన ఉంచాలి. ఈ చిట్కాను రెగ్యులర్‌గా ఫాలో అయితే, మంచి ఫలితం కనిపిస్తుంది. ఆలుగడ్డ నీటితో ముఖాన్ని కడుక్కుంటే.. ముడతలు తగ్గుముఖం పడతాయి. ముఖంపై తెల్లటి మచ్చలు తొలగించడంతోపాటు ఎండకు కమిలిపోయిన చర్మాన్ని మళ్లీ మామూలు స్థితికి తీసుకొస్తుంది.

# సబీనా సిస్టర్.. కంగ్రాట్యులేషన్స్!

ప్రతిభకి వయసు అడ్డంకి కాదని ఎంతోమంది నిరూపించారు. అయితే కేరళకి చెందిన సిస్టర్ సబీనా సాధించిన ఘనత మాత్రం అందుకు భిన్నమైనది. అక్టోబరు 22న కేరళ రాష్ట్ర 'మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్' నిర్వహించారు. అందులో 55 ప్లస్ కేటగిరీలో హర్డిల్స్ పోటీ నిర్వహించారు. ఆ పోటీలో 57 ఏళ్ల సబీనా కూడా ఉన్నారు. పోటీ ప్రారంభమైంది. కాళ్లకి చెప్పులు లేకుండా, సాంప్రదాయ దుస్తులు ధరించిన సిస్టర్ సబీనా ఎంతో వేగంగా హర్డిల్స్‌ని దాటుకుంటూ గమ్యాన్ని చేరారు. పోటీలో ప్రథమంగా నిలిచారు. బంగారు పతకం సాధించిన సబీనా ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పిఇటిగా త్వరలో రిటైర్ అవుతున్న ఆమె సాధించిన ఈ ప్రతిభ అటు విద్యార్థులని, ఇటు సాధారణ ప్రజలని కూడా ప్రభావితం చేస్తోంది.

కాసర్‌గడ్ జిల్లా ఎన్నప్ర గ్రామం సబీనా సొంత ఊరు. వయనాడ్ ద్వారకాలో అప్పర్ ప్రైమరీ స్కూల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా 1993 నుండి విధులు నిర్వహిస్తున్నారు. బాల్యం నుండీ సబీనాకి ఆటలంటే ఆసక్తి. 9వ తరగతి నుండి క్రీడల్లో రాణించిన ఆమె, కాలేజీ స్థాయిలో పలు పోటీల్లో పాల్గొన్నారు. జాతీయస్థాయిలో హర్డిల్స్ ఆడిన అనుభవం ఆమెది. అయితే ఆ తరువాత బోధనపై




దృష్టి పెట్టి క్రీడలని దూరంపెట్టారు. ఇది నా చివరి ఆట..: తాజాగా సాధించిన ఘనత గురించి సబీనా ఇలాచెబుతున్నారు 'ఇది నా చివరి ఆట. వచ్చేమార్చిలో నేను రిటైర్ అవుతున్నాను. రిటైర్ అయ్యేలోపు ఒక్కసారైనా పోటీలో పాల్గొనాలని అనుకున్నాను. అందుకే ఈ 'స్పోర్ట్స్ మీట్'కి వచ్చాను' అని అన్నారు. సబీనా పోటీలో గెలిచినప్పుడు 'సబీనా సిస్టర్ కంగ్రాట్యులేషన్స్' అంటూ ప్రేక్షకులు అభినందనలతో ఆమెని చుట్టుముట్టారు. సబీనా విజయం కేవలం పోటీలో పాల్గొనడం వరకే పరిమితం కాదు. వ్యక్తిలో దాగున్న సామర్థ్యాన్ని వెలికితీయడానికి వయసు, ఆచారాలు అడ్డంకి కాదని మరోసారి రుజువైంది.

# సినిమా..

## రామ్ చరణ్, ఎన్టీఆర్ మీదనే జాన్వీకపూర్ ఆశలు..



అందాల భామ జాన్వీకపూర్ కు బాలీవుడ్ నుంచి వరుస షాకులు తగిలాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మూడు సినిమాలు రిలీజ్ అయితే.. అందులో ఒక్కటి కూడా కమర్షియల్ గా సక్సెస్ సాధించలేకపోయింది. పరమ్ సుందరి, సన్నీ సంస్కారి కి తుల్సీ కుమారి సినిమాలకు మోస్తరుగా ఓపెనింగ్స్ వచ్చాయి కానీ.. అవి బాక్సాఫీస్ దగ్గర నిలబడలేక ఫెయిల్యూర్లుగా నిలిచాయి. హోంబౌండ్‌కు ప్రశంసలు దక్కాయి కానీ కమర్షియల్ గా హిట్ కాలేదు. మరీ దారుణం ఏంటంటే ఈ భామకు బాలీవుడ్ అస్సలు కలిసి రావట్లేదు. అక్కడ ఎన్ని సినిమాలు చేస్తున్నా సరే మినిమం హిట్ కూడాపడట్లేదు. దీంతో ఈ బ్యూటీ సౌత్ ఇండస్ట్రీనే దిక్కు అని అనుకుంటోంది. ఎందుకంటే జూనియర్ ఎన్టీఆర్ తో చేసిన దేవర మంచి హిట్ అయింది. ఆ సినిమా జాన్వీకపూర్ కు బూస్ట్ ఇచ్చింది. ఆ సినిమా వల్లే ఆమె రామ్ చరణ్ పెద్దిలో ఛాన్స్ దక్కించుకుంది. పెద్ది షూటింగ్ ప్రస్తుతం స్పీడ్ గా జరుగుతోంది. ఆ వెంటనే దేవర-2 కూడాస్టార్ట్ అయ్యే అవకాశాలుఉన్నాయి. దీంతో జాన్వీ ఇప్పుడు తన ఆశలన్నీ పెద్ది, దేవర-2 మీదనే పెట్టుకుంది. ఈ రెండు సినిమాలు హిట్ అయితే తన కెరీర్ మళ్లీ గాడిన పడుతుందని భావి స్తోంది. ఈ సినిమాలతో తనకు బాలీవుడ్ లో ఛాన్సులు రాకపోయినా.. సౌత్ లో మంచి ఆఫర్లు వస్తాయని.. మరీ ముఖ్యంగా టాలీవుడ్ లో పాగా వేయొచ్చనిభావిస్తోంది. ఎలాగూ తన తల్లి శ్రీదేవి అభిమానులు తనకు సపోర్ట్ చేయకపోతారా అని ఆశిస్తోంది. ఇలా రెండూ కలిసొస్తాయి అనుకుంటుంది ఈ గ్లామర్ డాల్. పెద్ది సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. దేవర ఎలాగూ హిట్ గ్యారెంటీ మూవీ. మరి ఈ బ్యూటీ పెట్టుకున్న ఆశలు నిలబడుతాయా లేదా చూడాలి.

## నిన్న ఓజీ.. ఇప్పుడు 'అఖండ 2'




ఎటాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ తన ఎనర్జీతో పాటు మాస్ బీట్స్‌తో ప్రేక్షకులను ఎప్పుడు థ్రిల్ చేస్తూనే ఉన్నాడు. 'అఖండ', 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి', 'డాకు మహరాజ్' వంటి చిత్రాలకు ఆయన అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్లు, మాస్ బీట్స్ పెద్ద హిట్ అయ్యాయి. ఇటీవల పవన్ కళ్యాణ్ హీరోగా వచ్చిన 'ఓజీ'కి కూడా తమన్ అద్భుతమైన ట్యూన్స్, బీట్స్ అందించి, ఆడియన్స్‌ను మంత్రముగ్ధులని చేశాడు. 'ఓజీ'లో పవన్ ఎంట్రీ సీన్స్‌లో ఆయన సౌండ్ ఇచ్చిన BGM భారీగా వైరల్ అయింది. తాజాగా తమన్ మళ్లీ వార్తల్లోకి ఎక్కాడు. బాలయ్య హీరోగా రూపొందుతున్న 'అఖండ 2' కోసం ఆయన మరింత ఉత్సాహం చూపుతున్నారు. తాజాగా థమన్ తన తలకి NBK అని రాసిన బ్యాండేజ్ కట్టుకుని తీసుకున్న ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ ఫోటోని చూసిన బాలయ్య అభిమానులు అతన్ని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. "ఇంత డెడికేషన్ చూపించే మ్యూజిక్ డైరెక్టర్ ఎవరూ లేరు" అంటూ ఫ్యాన్స్ ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే కొంతమంది నెటిజన్లు వ్యంగ్యంగా కూడా కామెంట్లు చేస్తున్నారు. "నిన్న కళ్యాణ్ తమన్, ఈ రోజు నందమూరి తమన్, రేపు ఇంకెవరు?" అని, "నీలో మస్తు షేడ్స్ ఉన్నాయ్ బ్రో" అని ట్రోల్ చేస్తున్నారు. అయితే ఓజీ బ్యాండ్‌తో ఉన్న ఫొటోని బాలయ్య ఫ్యాన్స్ ఎడిట్ చేశారని కొందరు అంటున్నారు. ఏదేమైన కొన్ని సమయాల్లో తమన్ ఇమేజ్‌పై భిన్న అభిప్రాయాలు ఏర్పడుతున్నాయి. తమన్ తన ప్రతి స్టార్ హీరో సినిమా కోసం హార్ట్ & సోల్ పెట్టి పనిచేస్తాడు. ' అఖండ'తో సౌండ్ బాక్సులు బద్దలుగొట్టిన ఆయన, 'అఖండ 2'లో ఇంకెంత విధ్వంసం సృష్టిస్తాడో అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఏ హీరో కోసం పని చేసినా తమన్ మ్యూజిక్ సౌండ్ కొత్త హైప్‌ను తెస్తుంది అనేది కచ్చితంగా చెప్పవచ్చు. ఇక నందమూరి బాలయ్య- బోయపాటి కాంబోలో రూపొందుతున్న అఖండ 2 చిత్రంపై భారీ అంచనాలు ఉన్న విషయం తెలిసిందే. ఈ సినిమాతో మరో హిట్ కొట్టడం ఖాయం అంటున్నారు. ఈ సినిమా కోసం బాలయ్య ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.


## రాజమౌళి-మహేశ్ బాబుల మూవీ

### మ్యూజిక్ సెషన్ మొదలయ్యిందన్న కాలభైరవ




ఎస్ఎస్ఎంబి 29 ప్రస్తుతం భారతీయ సినీ ఇండస్ట్రీలో క్రేజీ ప్రాజెక్ట్. మహేశ్‌బాబు కథానాయకుడిగా అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ అడ్వెంచర్ మూవీ ఇది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న మూవీకి సంబంధించి ఎప్పుడెప్పుడు అప్‌డేట్‌లు వస్తాయా? అని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో సంగీత దర్శకుడు కీరవాణి తనయుడు కాల భైరవ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఆయన స్వరాలు సమకూర్చిన 'మోగ్లీ' మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా మహేశ్-రాజమౌళి ప్రాజెక్ట్‌కు సంబంధించి అప్‌డేట్‌ను ఇచ్చారు. ఇటీవల ఈ సినిమాకు సంబంధించి సంగీత కార్యక్రమాలు మొదలైనట్లు తెలిపారు. నాన్నగారి సినిమాల్లో వర్క్ ఉంటే, కచ్చితంగా చెబుతారు. ముఖ్యంగా రికార్డింగ్ సెషన్స్‌కు వెళ్తా. ఎస్ఎస్ఎంబి 29కు సంబంధించి కూడా మ్యూజిక్ పనులు ఇటీవల మొదలయ్యాయి. నేను కూడా అందులో భాగమయ్యా అని అన్నారు. దీంతో మహేశ్ అభిమానులు సామాజిక మాధ్యమాల వేదికగా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ మూవీకి సంబంధించి అసలైన అప్‌డేట్ నవంబరులో రానుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. టైటిల్‌ను వెల్లడించడంతో పాటు, ఓ వీడియోను కూడా విడుదల చేసే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే ఇందుకు సంబంధించిన పనులను కూడా పూర్తి చేశారట. హైదరాబాద్ వేదికగా ప్రెస్‌మీట్ లేదా ఈవెంట్‌ను నిర్వహించి వీడియోను విడుదల చేయనున్నారు. అప్పుడే సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## లేట్ నైట్ వదిలిన బర్త్ డే గ్లింప్స్..




పాన్ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా .. సెన్సేషనల్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ డ్రామా 'స్పిరిట్' పై దేశవ్యాప్తంగా అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. 'అర్జున్ రెడ్డి', 'కబీర్ సింగ్', 'యానిమల్' లాంటి సెన్సేషనల్ సినిమాల తర్వాత సందీప్ రెడ్డి వంగా, ఇప్పుడు ప్రభాస్‌తో మాస్ ఎమోషనల్ పోలీస్ డ్రామా చేయబోతుండటంతో అభిమానుల్లో భారీ హైప్ నెలకొంది. భద్రకాళి పిక్చర్స్, టి-సిరీస్ సంయుక్తంగా ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రీ-ప్రొడక్షన్ పనులు దాదాపు పూర్తి కాగా, షూటింగ్ త్వరలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ సినిమాను 2026లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ గురువారం రాత్రి 11 గంటలకు 'ది సౌండ్ స్టోరీ ఆఫ్ ది ఫిల్మ్ స్పిరిట్' అనే 1 నిమిషం 31 సెకండ్ల గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ వీడియోను తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ చేశారు. సౌండ్ థీమ్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేసిన సందీప్ వంగా మార్క్ స్టైల్ గ్లింప్స్‌లో బలంగా కనిపించింది. ఐపీఎస్ ఆఫీసర్‌గా ఉన్న ప్రభాస్ అరెస్ట్ అయ్యే సన్నివేశాలను కేవలం ఆడియో రూపంలో చూపించడం ఆసక్తికరంగా మారింది. ఇందులో ప్రకాశ్ రాజ్ వాయిస్‌తో.."వీడి గురించి విన్నాను యూనిఫాం ఉన్నా లేకపోయినా బిహేవియర్‌లో తేడా ఉండదు.. చూద్దాం ఈ ఖైదీ యూనిఫాంలో ఎలా ఉంటాడో!" అనేది వంగా రైటింగ్ శైలిని గుర్తు చేసింది. ఇక చివర్లో ప్రభాస్ చెప్పిన.. "మిస్టర్ సూపరింటెండెంట్.. నాకు చిన్నప్పటి నుంచి ఒక బ్యాడ్ హ్యాబిట్ ఉంది" అనే డైలాగ్ గ్లింప్స్ మొత్తానికే హైలైట్‌గా నిలిచింది. ఆ ఒక్క లైన్‌తోనే ఆయన పాత్ర ఇంటెన్స్‌గా, రఫ్‌గా ఉండబోతుందనేది స్పష్టమవుతోంది. సినిమా సౌండ్ డిజైన్‌పై మాట్లాడిన సందీప్ వంగా, "సాధారణంగా సినిమాకు బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌ను చివర్లో జత చేస్తారు. కానీ 'స్పిరిట్'లో మేము ముందే 70 శాతం సౌండ్‌ట్రాక్‌ను సిద్ధం చేశాం. ఆ సౌండ్ ఆధారంగా షాట్లు ప్లాన్ చేస్తున్నాం," అని చెప్పారు. ఇది భారతీయ సినీ చరిత్రలో అరుదైన ప్రయోగమని ఇండస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సినిమాలో ప్రభాస్‌తో పాటు వివేక్ ఒబెరాయ్, త్రిప్తి దిమ్రీ, ప్రకాశ్ రాజ్, కాంచన వంటి ప్రముఖనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భారీ సెట్‌లు, టాప్‌టెక్నికల్ టీమ్, అత్యాధునికయాక్షన్ సీక్వెన్స్‌తో సినిమా నిర్మాణం జరుగనుంది. ప్రస్తుతం ప్రభాస్ 'ది రాజా సాబ్', 'ఫౌజీ' సినిమాలతో బిజీగా ఉన్నారు. వీటితోపాటు త్వరలోనే 'స్పిరిట్' షూటింగ్‌లో పాల్గొననున్నారు. సందీప్ వంగా ఈ ప్రాజెక్ట్‌ను సింగిల్ షెడ్యూల్‌లో పూర్తి చేయాలని భావిస్తున్నాడు. ఇక తర్వాత ప్రభాస్ లైనప్‌లో 'కల్కి 2898 AD 2', 'సలార్ 2' వంటి పెద్ద ప్రాజెక్ట్‌లు ఉన్నాయి.

## రాహుల్ సిప్లిగంజ్ ఇంట మొదలైన పెళ్లి పనులు..



టాలీవుడ్ గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాడు. ఇటీవల .. రాహుల్, హరిణ్య అనే యువతితో అంగరంగ వైభవంగా ఎంగేజ్‌మెంట్ వేడుక జరుపుకున్నాడు. ఈ కార్యక్రమానికి కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహిత మిత్రులు మాత్రమే హాజరయ్యారు. ఈ వేడుకకు కేవలం సన్నిహితులు, స్నేహితులు మాత్రమే హాజరు కాగా, ఆ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

ఇక ఇప్పుడు రాహుల్ పెళ్లి పనులు మొదలైనట్టు తెలుస్తుంది. హరిణ్య తన సోషల్ మీడియాలో కొన్ని పిక్స్ షేర్ చేయగా, ఇందులో హరిణ్యకి రాహుల్ ముద్దు పెట్టడం, జడ లాగడం, పసుపు దంచడం వంటివి చేస్తున్నాడు. లగ్న పత్రిక కార్యక్రమం జరిగిందని చెబుతూ ఈ ఫొటోలు షేర్ చేసింది హరిణ్య. త్వరలోనే ఈ జంట పెళ్లి పీటలు ఎక్కనున్నట్టు తెలుస్తుంది.

ఇక ప్రైవేట్ సాంగ్స్‌తో యూత్‌లో సెన్సేషన్‌గా మారిన రాహుల్ సిప్లిగంజ్, ఆ తర్వాత టాలీవుడ్‌లో ప్లేబ్యాక్ సింగర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ముఖ్యంగా మాస్ బీట్‌లకు రాహుల్ వాయిస్ బాగా సూట్ అవుతుంది. రెండు సంవత్సరాల క్రితం విడుదలైన రాజమౌళి దర్శకత్వంలోని ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో "నాటు నాటు" పాటతో ఆయనకు అంతర్జాతీయ ఖ్యాతి వచ్చింది. ఈ పాట ఆయనను ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందిన గాయకుడిగా నిలిపింది. ఆ పాటకు ఆస్కార్ అవార్డు రావడంతో, రాహుల్ సిప్లిగంజ్ పేరు దేశవ్యాప్తంగా మార్మోగిపోయింది.

ఆస్కార్ వేదికపై పాట పాడి దేశం గర్వించేటట్లు చేసిన రాహుల్‌ను 2023లో అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సత్కరించి రూ.10 లక్షల ప్రోత్సాహకం అందించారు. అనంతరం సీఎం అయిన తర్వాత తన మాట నిలబెట్టుకుని, రాహుల్‌కు రూ.1 కోటి రూపాయల బహుమతి చెక్కును అందజేశారు. ఈ ఘనత రాహుల్ కెరీర్‌లో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. తెలంగాణ సొగసు, భాషా స్వరూపం కలగలిపిన పాటలతో రాహుల్ తనదైన గుర్తింపు తెచ్చుకున్నాడు. "రేవంత్ రెడ్డి కాలింగ్", "గల్లీ కా గణేష్" వంటి పాటలు యువతలో విపరీతంగా పాపులర్ అయ్యాయి. ఇప్పుడు ఆయన జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. సినీ కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితంలో కూడా విజయవంతం కావాలని అభిమానులు కోరుకుంటున్నారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215